www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 178 | శుక్రవారం 21.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## పీసీసీ చీఫ్ ఆగ్రహం



- పార్టీ లైన్ దాటితే ఎంతటి వారినైనా ఉపేక్షించం
- కొండా సుస్మిత వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ ఆగ్రహం
- సుస్మిత, చిన్నారెడ్డిలను వివరణ కోరాం
- క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు

03

## సుస్మిత వ్యాఖ్యలతో నాకేం సంబంధం?




- సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతమే.. నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చిన మంత్రి కొండా సురేఖ
- ఒకరి అభిప్రాయాలకు మరొకరు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు..

03

## స్టే ఎత్తివేతకు నిరాకరణ.!

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్'



- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఉచిత పథకాలకు చట్టబద్ధ ఆధారం ఏంటి?
- ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు వాడటం ఎంతవరకు సమంజసం?
- జీతాలు, పెన్షన్లకు నిధుల్లేవు.. ఉచిత పథకాలెందుకు?

02




# సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు..

## దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి డిమాండ్

## కావేరి జలాలపై భిన్న స్వరాలు

### 1971 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా కొనసాగించాలి

### డీలిమిటేషన్‌పై దక్షిణాది ఆందోళన

### కేంద్ర నిధులపై కేరళ అసంతృప్తి

- దక్షిణాది రాష్ట్రాల హక్కులపై సమిష్టి గళం
- సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు.. హక్కులు తగ్గొద్దు
- డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళన
- జనాభా నియంత్రణ చేసిన రాష్ట్రాలకు అన్యాయం వద్దు
- 1971 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా కొనసాగించాలి
- లోక్‌సభ సీట్లు యథాతథంగా కొనసాగించాలని డీకే శివకుమార్ డిమాండ్
- దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపకంలో న్యాయం చేయాలి

02

జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా రాజకీయంగా నష్టం జరగకూడదన్న అభిప్రాయం సమావేశంలో ప్రధానంగా వ్యక్తమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదే స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించారు.

# మంత్రి పొంగులేటి కౌంటర్!

## ఆ రహస్యమేంటో చెప్పు హరీశ్ రావు..

### బహిరంగ లేఖతో హరీశ్.. ఎక్స్ పోస్టుతో పొంగులేటి

మరోసారి వేడెక్కిన తెలంగాణ రాజకీయం



- 22-ఏ భూములపై పొంగులేటి–హరీశ్ మధ్య మాటల యుద్ధం
- హరీశ్ ఆరోపణలకు పొంగులేటి ఘాటు కౌంటర్
- బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి తీవ్ర విమర్శలు
- 22-ఏ భూముల వివాదం.. రగులుతున్న తెలంగాణ రాజకీయం
- అవినీతిపై హరీశ్ మాటలు హాస్యాస్పదం: పొంగులేటి
- బీఆర్ఎస్ పాలనపై పొంగులేటి సంచలన వ్యాఖ్యలు
- ప్రతిపక్షంగానూ బీఆర్ఎస్ విఫలమైంది: పొంగులేటి
- కాళేశ్వరం, ధరణిపై బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసిన మంత్రి
- అవినీతి ఆరోపణలపై పొంగులేటి–హరీశ్ పరస్పర విమర్శలు
- 22-ఏ భూముల వివాదం.. కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య దుమారం
- హరీశ్‌కు పొంగులేటి సూటి ప్రశ్నలు.. 'ఆ రహస్యం ఏంటో చెప్పు'
- ప్రతిపక్ష పాత్రపైనా బీఆర్ఎస్‌ను నిలదీసిన పొంగులేటి

03

### విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే


# మెరుగైన సౌకర్యాలు..

## 2029 ఎన్నికల నాటికి కీలక శక్తిగా జెన్ జీ..

## ధర్మం కాదు పిల్లల భవిష్యత్ ప్రమాదంలో..

- ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కరువు
- మంత్రుల కుక్కలకు ఉన్న సౌకర్యాలు విద్యార్థులకు లేవు
- పాఠశాలల దుస్థితిపై సీజేపీ నేత అభిజీత్ దీప్కే ఆగ్రహం
- విద్యాశాఖ మంత్రి దాదా భుసే రాజీనామాకు డిమాండ్
- లీకేజీలు.. చెత్తాచెదారం.. పాములకు ఆవాసాలుగా పాఠశాలలు
- పాముకాట్లతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు
- తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలి
- పాఠశాలలు బాగుచేసే వరకు నాయకులను గ్రామాల్లోకి రానివ్వొద్దు

02




## నగరంలో పాక్ టెర్రర్ మోడ్యూల్ మూలాలు..



- హైదరాబాద్‌లో షహజాద్ భట్టి టెర్రర్ నెట్‌వర్క్ కలకలం
- 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో ఆపరేషన్.. 253 మంది అదుపులో
- తెలంగాణలో ఇద్దరు అనుమానితుల అరెస్ట్
- ఉగ్ర కుట్రలు, ఆర్థిక లావాదేవీలపై లోతైన దర్యాప్తు
- సోషల్ మీడియా ప్రభావంతో నెట్‌వర్క్ విస్తరణ
- లాహోర్ అండర్‌వరల్డ్ నుంచి ఐఎస్ఐ నెట్‌వర్క్ వరకు
- సోషల్ మీడియానే ఆయుధంగా మార్చుకున్న షహజాద్ భట్టి

02

## పొంగులేటి బర్తరఫ్‌కు డిమాండ్


### రిటైర్డ్ హైకోర్టు జడ్జితో దర్యాప్తు చేయాలి

ప్రైవేటు ఆస్తులను 22ఏలో పెట్టి వేధిస్తున్నారు: హరీశ్

- 22ఏ భూముల పేరుతో వసూళ్ల దందా
- రెవెన్యూ శాఖలో అవినీతిపై హరీశ్ సంచలన ఆరోపణలు
- పొంగులేటిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- ప్రైవేటు ఆస్తులను 22ఏలో పెట్టి వేధిస్తున్నారు

03





## 30ఏళ్లకు నిర్దోషులుగా

- రూ.20 లంచం కేసులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట
- 30 ఏళ్ల న్యాయపోరాటానికి సుప్రీంకోర్టులో తెర
- లంచం డిమాండ్ చేసినట్లు ఆధారాలు లేవు
- కేవలం రూ.20 రికవరీతో దోషిగా తేల్చలేం

02



# నగరంలో పాక్ టెర్రర్ మోడ్యూల్ మూలాలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దాయాది పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో నడుస్తున్న గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టి టెర్రర్ నెట్‌వర్క్ మూలాలు హైదరాబాద్ నగరంలో బయటపడటం తీవ్ర కలకలం రేపుతోంది. దేశవ్యాప్తంగా నిశబ్ధ విధ్వంస దాడులకు కుట్ర పన్నుతున్న ఈ ముఠాపై కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు, వివిధ రాష్ట్రాల పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నెట్‌వర్క్‌ను ఛేదించాయి.

**ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా ఐఎస్ఐ వల..**

పాకిస్థాన్‌కు చెందిన షహజాద్ భట్టి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీల్స్, వీడియోలు పెడుతూ యువతను ఆకర్షిస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో తన పోస్టులను లైక్, కామెంట్ చేసే యువకులకు వలవేసి వారిని ఐఎస్ఐ నెట్‌వర్క్‌లో ఏజెంట్లుగా మార్చుకుంటున్నట్లుగా కేంద్ర ఇంటెలిజెన్స్ విచారణలో తేలింది. పెద్ద మొత్తంలో డబ్బు, ప్రలోభాలతో వీరిని దేశ వ్యతిరేక కార్యకలాపాలకు, సమాచారం సేకరించడానికి వినియోగిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు.

**మేడ్చల్, యూసుఫ్‌గూడలో ఇద్దరి అరెస్ట్**

ఈ క్రమంలో భాగ్యనగరం కేంద్రంగా సాగుతున్న కార్యకలాపాలపై కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు, నగర పోలీసుల సాయంతో మెరుపు దాడులు నిర్వహించాయి. మేడ్చల్‌కు చెందిన జాయిద్ ఖాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. జాయిద్ ఖాన్ నిత్యం ఐఎస్ఐ సానుభూతిపరులతో ఎన్‌క్రిప్టెడ్ చాటింగ్ చేస్తున్నట్లుగా అధికారులు పక్కా ఆధారాతో నిర్ధారించుకున్నారు. అతడి చాటింగ్‌లపై గత రెండు, మూడు నెలల నుంచి కేంద్ర ఇంటెలిజెన్స్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇదే నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్న యూసుఫ్‌గూడకు చెందిన మరొక యువకుడిని కూడా అధికారులు అరెస్ట్ చేశారు.


**14 రాష్ట్రాల్లో 253 మంది అదుపులోకి..**

అయితే, ఈ భారీ కుట్రను ఛేదించడంలో భాగంగా దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేసి 253 మందిని అదుపులోకి తీసుకోగా, తెలంగాణ నుంచి ఇద్దరు పట్టుబడ్డారు. ప్రస్తుతం నిందితులను సుదీర్ఘంగా విచారిస్తున్నారు. ఈ ప్రాథమిక విచారణలో దేశంలో పన్నిన ఉగ్ర కుట్రలు, ఆర్థిక లావాదేవీలు, వీరికి నగరంలో ఉన్న ఇతర సహకారులకు సంబంధించిన మరిన్ని కీలక వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

**అమిత్ షా చెప్పిన షహజాద్ భట్టి ఇతడే..**

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాద్ భట్టీ తొలుత దోపిడీలు, ఇతర నేరాలతో నేర ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా దర్యాప్తు సంస్థలు తెలిపాయి. అనంతరం లాహోర్ అండర్ వరల్డ్‌లో అతడి పేరు వినిపించింది. 2013లో అతడిపై పలు కేసులు కూడా నమోదయ్యాయి. ఇక పాకిస్థాన్ నుంచి యూఏఈకి వెళ్లిన భట్టి.. స్క్రాప్ సహా వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లుగా ప్రచారం చేసుకున్నాడు. పాకిస్థాన్‌లో టిక్‌టాక్ విస్తృతంగా ప్రాచుర్యంలోకి వచ్చిన తర్వాత భట్టీ సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపు పొందాడు. మతపరమైన అంశాలు, జాతీయవాదం, వివాదాస్పద విషయాలపై పోస్టులు, వీడియోలు చేస్తూ పెద్ద సంఖ్యలో ఫాలోవర్లను సంపాదించుకున్నాడు. సోషల్ మీడియా ప్రభావాన్ని ఉపయోగించుకుని తన పరిచయ వర్గాన్ని విస్తరించుకుంటూ రహస్యంగా పాక్ ఐఎస్ఐకి పనిచేస్తున్నట్లుగా దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.

# విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన సౌకర్యాలు..



**మహారాష్ట్ర :** మహారాష్ట్రలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, మంత్రులు, ప్రజా ప్రతినిధులు పెంచుకునే కుక్కలకు ఉన్న సదుపాయాలు కూడా విద్యార్థులకు లేవని మండిపడ్డారు. వెంటనే మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భుసే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సురక్షితమైన రహదారులు లేకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు జంతువుల కంటే ఘోరమైన వాతావరణంలో చదువుకుంటున్నారని ఆరోపించారు.

**పాఠశాలల తనిఖీ - తీవ్ర విమర్శలు:**

ఇటీవల ప్రారంభించిన 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమంలో భాగంగా దీప్కే గురువారం మహారాష్ట్ర లాతూర్ జిల్లా ఔసా తహసీల్‌ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను సీజేపీ టీమ్ పరిశీలించింది. ఈ సందర్భంగా మాట్లాడిన అభిజీత్ దీప్కే.. రేకుల కప్పుల నుంచి లీకేజీలు, అపరిశుభ్రమైన పరిసరరాలు.. చెత్తాచెదారంతో పాములకు నిలయాలుగా మారుతున్న పాఠశాల ఆవరణల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. పాముకాటుకు గురై పిల్లలు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు అధికార యంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు.

**ధర్మం కాదు పిల్లల భవిష్యత్ ప్రమాదంలో..**

రాజకీయ నాయకులు విద్యార్థుల కోసం ఏమీ చేయనప్పుడు ప్రజలు వారికేందుకు ఓటెయ్యాలి? అని ఈ సందర్భంగా దీప్కే ప్రశ్నించారు. కేవలం హెలికాప్టర్లలో తిరగడానికే ప్రజలు ఓట్లేస్తున్నారా? ధర్మం ప్రమాదంలో ఉందంటూ రాజకీయాలు చేసే నాయకులు, పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని గుర్తించాలని అని హితవు పలికారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపినప్పుడే అక్కడి సమస్యల తీవ్రత అర్థమవుతుందని మరోసారి స్పష్టం చేశారు. పాఠశాలలను బాగుచేసే వరకు ఏ నాయకుడినీ ఓట్ల కోసం ఊర్లోకి రానివ్వకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు.

**2029 ఎన్నికల నాటికి కీలక శక్తిగా జెన్ జీ..**

జెన్ జీ ఆందోళనలపై స్పందిస్తూ 2029 ఎన్నికల నాటికి యువత ఒక ముఖ్యమైన ఎన్నికల శక్తిగా ఏర్పడతారని దీప్కే అన్నారు. రాజకీయ పార్టీలు యువత సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచకపోతే గ్రామాల వ్యాప్తంగా భారీ నిరసనలు వ్యక్తమవుతాయని, జెన్ జీ ఓటర్లు రాబోయే రోజుల్లో ప్రజాప్రతినిధులను ఖచ్చితంగా నిలదీస్తారని హెచ్చరించారు. లాతూర్‌లోని నీట్ పేపర్ లీక్ కేసుపై సీబీఐ విచారణ కింది స్థాయి నిందితులనే లక్ష్యంగా చేసుకుని జరుగుతోందని పెద్ద తలకాయలను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వ్యవస్థలోని ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా ఇంతటి భారీ కుంభకోణం జరగడం సాధ్యం కాదని పేర్కొన్నారు.

# 30ఏళ్లకు నిర్దోషులుగా

## రూ.20 లంచం కేసులో 30ఏళ్లకు నిర్దోషులుగా తేల్చిన సుప్రీంకోర్టు

**న్యూ ఢిల్లీ :** 20 రూపాయల లంచం తీసుకున్నారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు నిర్దోషులుగా తేలారు. 30 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు సాగిన ఈ న్యాయపోరాటంలో ఎట్టకేలకు తాజాగా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను దోషులుగా తేల్చుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెడుతూ వారిని నిర్దోషులుగా జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. లంచం డిమాండ్ చేసినట్లు రుజువులు లేవని, కేవలం రూ.20 రికవరీ చేసినంత మాత్రాన దోషిగా నిర్ధారించలేమని కోర్టు పేర్కొంది.

**రూ. 120 లంచం డిమాండ్ ఆరోపణలు:**

1996 ఫిబ్రవరిలో గుజరాత్ ఆనంద్ జిల్లాలోని బెచ్రీ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అక్కడ పని చేసే క్లర్క్ రూ. 120 లంచం డిమాండ్ చేశాడని అందులో రూ. 100 తనకు కాగా మరో రూ. 20 ప్యూన్ కోసం అని అడిగాడని సదరు విద్యార్థి ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన అధికారులు ట్రాప్ చేసి డబ్బులు తీసుకుని ఇన్ కమ్ సర్టిఫికేట్ ఇస్తుండగా ప్యూన్ ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.20 స్వాధీనం చేసుకున్నారు. అయితే క్లర్క్ డిమాండ్ చేశాడన్న రూ.100 మాత్రం ఎక్కడా లభించలేదు. దీంతో కేవలం నగదు రికవరీ అయినంత మాత్రాన లంచం తీసుకున్నట్లు నిర్ధారించలేమని, లంచం డిమాండ్ చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉండాలని ఈ సందర్భంగా ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాగే ఫిర్యాదుదారుడి వాంగ్మూలంలో పలు వైరుధ్యాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది.




# సెలవు తేదీ మార్చుతూ ఉత్తర్వులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఏపీలో ప్రభుత్వ సెలవులకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. మిలాద్ ఉన్ నబీ పండగ సెలవు తేదీని మారుస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ముస్లిం మత పెద్దల అభ్యర్థన, నూతన చంద్ర దర్శనం ఆధారంగా పూర్వపు సెలవు దినంలో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే, గతంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల కోసం ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 25న మిలాద్ ఉన్ నబీ పబ్లిక్ హాలిడేగా పేర్కొన్నారు. తాజాగా సవరించిన ఉత్తర్వుల ప్రకారం ఆ సెలవును ఆగస్టు 26 అంటే బుధవారానికి మార్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులను విడుదల చేశారు.

**తెలంగాణలోనూ 26నే పబ్లిక్ హాలిడే..**

మరోవైపు పొరుగు రాష్ట్రంలో తెలంగాణలో కూడా 'మిలాద్ ఉన్ నబీ' పబ్లిక్ హాలిడేను ఆగస్టు 26నే ఖరారు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆగస్టు 26వ తేదీనే 'మిలాద్ ఉన్ నబీ' సెలవు దినంగా అమలు కానుంది.

# సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు..

**న్యూ ఢిల్లీ :** దక్షిణ మండలి సమావేశం ఈసారి కీలక రాజకీయ, ఆర్థిక అంశాలకు వేదికగా మారింది. డీలిమిటేషన్, కేంద్ర నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులు, నదుల అనుసంధానం, అభివృద్ధి, కనెక్టివిటీ వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాల నేతలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించారు. రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాలతో పాటు కేంద్రం ముందు సమిష్టిగా తమ డిమాండ్లను ఉంచే వేదికగా ఈ సమావేశం కనిపించింది. మొత్తంగా సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు.. రాష్ట్రాల హక్కులు తగ్గొద్దు అన్న సందేశం బలంగా వినిపించింది.

**డీలిమిటేషన్‌పై దక్షిణాది ఆందోళన**

జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా రాజకీయంగా నష్టం జరగకూడదన్న అభిప్రాయం సమావేశంలో ప్రధానంగా వ్యక్తమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదే స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గితే అన్యాయం జరుగుతుందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఆర్థిక ప్రాధాన్యానికి తగ్గట్టుగానే రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడు రాజకీయ నేత విజయ్ కూడా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చట్టబద్ధమైన హామీ అవసరమని డిమాండ్ చేశారు.

**నిధుల పంపకంపై దక్షిణాది గళం**

ఆర్థిక సంఘం నిధుల పంపకంలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలన్న డిమాండ్ కూడా సమావేశంలో ప్రధానంగా వినిపించింది. 15వ ఆర్థిక సంఘం సమయంలో కర్ణాటక వాటా 4.7 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గిందని డీకే శివకుమార్ వెల్లడించారు. దీంతో ఆరేళ్లలో రాష్ట్రానికి సుమారు రూ.65 వేల కోట్ల నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. కర్ణాటకకు సిఫారసు చేసిన రూ.5,495 కోట్ల ప్రత్యేక గ్రాంటు విడుదల కాలేదని, మరో రూ.6 వేల కోట్ల రాష్ట్ర ప్రత్యేక గ్రాంటు కూడా అందలేదని డీకే పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘంలో కర్ణాటక వాటా 4.131 శాతానికి పెరిగినప్పటికీ, తమ వాటాను తిరిగి 4.7 శాతానికి పెంచాలని రాష్ట్రం కోరుతోంది.

**కావేరిపై భిన్న స్వరాలు**

నీటి సమస్యలపై దక్షిణాది రాష్ట్రాల మధ్య భిన్న అభిప్రాయాలు కూడా సమావేశంలో స్పష్టమయ్యాయి. నీటి పంపకాల వివాదాల నుంచి నీటి సహకారం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని డీకే శివకుమార్ అన్నారు. సమానత్వం, పారదర్శకత, పరస్పర సహకారంతో నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కావేరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, పాలార్ వంటి నదులు దక్షిణాది ప్రజల జీవనాడులని పేర్కొన్న ఆయన.. కృష్ణా, అప్పర్ భద్ర, నదుల అనుసంధానం వంటి అంశాలపై కర్ణాటక తన వైఖరిని స్పష్టం చేస్తుందని తెలిపారు. మరోవైపు కావేరి జలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, సంబంధిత అథారిటీల నిర్ణయాలను అమలు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. ముల్లైపెరియార్ జలాశయం నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచే విషయంలోనూ కోర్టు తీర్పులకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

**చంద్రబాబు.. అభివృద్ధి, కనెక్టివిటీపై ఫోకస్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం దక్షిణాది అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నదుల అనుసంధానంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఏపీ-కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను ఆయన ముందుకు తెచ్చారు. కుప్పం మీదుగా అమరావతి-బెంగళూరు-చెన్నై రవాణా కారిడార్ అభివృద్ధి చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టుల ఏర్పాటు, దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం వంటి ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని, విపత్తుల సమయంలో పరస్పర సహకారం కోసం మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఏపీ ప్రయోజనాలపైనా చంద్రబాబు ప్రత్యేక దృష్టి**

దక్షిణాది ఉమ్మడి అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలను కూడా చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన సమస్యలను పరిష్కరించాలని కోరారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన సమస్యలపై కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. దుగ్గరాజపట్నం పోర్టు, రిఫైనరీకి త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు ఇవ్వాలని, కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**గోదావరి--కావేరి అనుసంధానానికి ప్రతిపాదన**

దక్షిణాది జల సమస్యలకు పరిష్కారంగా నదుల అనుసంధానంపై చంద్రబాబు మరోసారి దృష్టి సారించారు. గోదావరి--కావేరి అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదనను ప్రస్తావించారు. తమిళనాడు నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంగా నదుల అనుసంధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు జలాల విషయంలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గంగా--కావేరి అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**కేంద్ర నిధులపై కేరళ అసంతృప్తి**


కేరళ కూడా కేంద్ర నిధుల పంపకం, తీర రక్షణ, ఆఫ్‌షోర్ మైనింగ్ అంశాలను సమావేశంలో ప్రస్తావించింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రం భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి తగినంత నిధులు రావడం లేదని కేరళ అసంతృప్తి వ్యక్తం చేసింది. రూ.1,493 కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం కేవలం రూ.151 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆ రాష్ట్రం పేర్కొంది. కేరళ తీర ప్రాంతంలో 63 శాతం మేర కోతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. తీర రక్షణ కోసం చీణ=ఖీ, ూణ=ఖీ నిధులను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. శాస్త్రీయ అధ్యయనాలు, సరైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ బ్లాకుల వేలం నిర్వహించవద్దని డిమాండ్ చేసింది. మైనింగ్ వల్ల తీర ప్రాంత పర్యావరణానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

**దక్షిణాది రాష్ట్రాల సమిష్టి స్వరం**

డీలిమిటేషన్, ఆర్థిక సంఘం నిధులు, నీటి పంపకాలు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ.. కేంద్రంతో సంబంధించి తమ ప్రయోజనాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు సమిష్టిగా గళం వినిపించాయి. మరోవైపు డ్రగ్స్, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సూచన కూడా వచ్చింది. మొత్తంగా చెన్నైలో జరిగిన దక్షిణ మండలి సమావేశం కేవలం రాష్ట్రాల సమస్యల చర్చకే పరిమితం కాకుండా.. దక్షిణాది రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక హక్కులు, అభివృద్ధి, నీటి వనరులు, కనెక్టివిటీ వంటి అంశాలపై భవిష్యత్‌లో సమిష్టి వ్యూహానికి వేదికగా మారే సంకేతాలను ఇచ్చింది.

# స్టే ఎత్తివేతకు నిరాకరణ.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయడానికి ఉన్నత న్యాయస్థానం స్పష్టంగా నిరాకరించింది. 2014 నుంచి అమలవుతున్న ఈ పథకాలకు చట్టబద్ధమైన ఆధారం ఏంటని ప్రశ్నించిన హైకోర్టు, కేవలం ప్రభుత్వ జీవోలతో ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు వాడటం ఎంతవరకు సమంజసమని నిలదీసింది. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర కీలక రంగాలు నిధుల కొరత ఎదుర్కొంటుంటే, మరోవైపు రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు కూడా సమయానికి అందక అనేకమంది తీవ్ర అవస్థలకు గురవుతున్నారని వ్యాఖ్యానించింది. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయని ఈ సందర్భంగా హెచ్చరించింది. ప్రజాపన్నుల ద్వారా వచ్చిన సొమ్మును ఉచిత పథకాలకు వెచ్చించే కంటే, ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తీసుకువచ్చి ఆ రాబడితో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చు కదా అని ధర్మాసనం సూచించింది. భూసేకరణలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, బాధితులు ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. దీనిపై తప్పుడు అఫిడవిట్ సమర్పించడంపైనా



న్యాయస్థానం క్లాస్ తీసకుంది. ఈ పథకాల చట్టబద్ధత, బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన వివరణ కావాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# పొంగులేటి బర్తరఫ్‌కు డిమాండ్

## 22ఏ అంశంపై రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో నిషేధిత భూముల (22ఏ) పేరుతో రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. 22ఏ దుర్వినియోగం, వసూళ్ల పర్వంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రైవేటు ఆస్తులపై 22ఏ వేధింపులు**

నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు ఆపడానికి తెచ్చిన చట్టాన్ని ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి ఉపయోగిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో HMDA అనుమతులు ఉన్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను వేధిస్తున్నారని పేర్కొన్నారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ULC) కింద దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన ఆస్తులు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న భూములను మళ్లీ నిషేధిత జాబితాలో పెట్టి స్తంభింపజేయడం దుర్మార్గమని హరీశ్ రావు మండిపడ్డారు.

**30 శాతం కమీషన్లు..**

రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల రాకెట్ నడుస్తోందని, నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించడానికి దళారులు మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని హరీశ్ రావు సంచలన ఆరోపణ చేశారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల ఉన్న విలువైన భూములపై వివాదాలు సృష్టించి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాలుగు నెలల క్రితమే చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఉండటాన్ని ప్రశ్నించారు. ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ఇంత పెద్ద కుంభకోణం జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ రావు అన్నారు.

**రిటైర్డ్ జడ్జితో స్వతంత్ర విచారణకు డిమాండ్..**

2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 22ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపైనా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని, ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కమీషన్లు, జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ల వెనుక ఉన్న పెద్దలు, దళారులు, బినామీ సంస్థల వెనుక ఉన్న రాజకీయ శక్తుల నిజా నిజాలను తేల్చాలన్నారు. జిల్లాల వారీగా 22ఏ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత పాటించాలని కోరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడుకోవడం కోసం ప్రజల విశ్వాసాన్ని పణంగా పెడుతున్నారని, రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ ఆరోపణలు అబద్ధమైతే వెంటనే విచారణకు ఆదేశించి ప్రభుత్వం నిజాయితీ నిరూపించుకోవాలని, లేదంటే బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని స్పష్టం చేశారు.



## రాజీవ్ గాంధీకి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళి

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి మహేష్ కుమార్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను, యువత, సాంకేతిక రంగం, స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యత కల్పించిన ఆయన దూరదృష్టిని మహేష్ కుమార్ గౌడ్ స్మరించుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రాజీవ్ గాంధీకి నివాళులర్పించారు.

# జేఎన్‌టీయూలో స్పాట్ అడ్మిషన్ల సందడి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎప్‌సెట్ మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ నిమిత్తం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించారు. బుధవారం ఉదయం వర్సిటీ అడ్మిషన్ల విభాగంలో జరిగిన కౌన్సెలింగ్‌కు సుమారు 200మంది అభ్యర్థులతోపాటు, వారి తల్లిదండ్రులు తోడు రావ డంతో క్యాంపస్‌లో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్ జేఎన్‌టీయూ కాలేజీలోని వివిధ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో 26, సుల్తాన్‌పూర్‌లో 8, జగిత్యాలలో 2 సీట్లు ఖాళీగా ఉండగా జగిత్యాలలో ఒక సీటు మినహా మిగిలిన సీట్లన్నీ హాట్ కేకేల్లా భర్తీ అయ్యాయని అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ బాలునాయక్ తెలిపారు. గురువారం మంథని, సిరిసిల్ల, పాలేరు కాలేజీల్లో, శుక్రవారం మహబూబాబాద్, వనపర్తి, కోస్గి జేఎన్‌టీయూ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్‌ను హైదరాబాద్ క్యాంపస్‌లోనే నిర్వహిస్తామని చెప్పారు. స్పాట్ కౌన్సెలింగ్‌లో అభ్యర్థుల ఎప్‌సెట్ ర్యాంకు, రిజర్వేషన్ కేటగిరి, ఇంటర్‌మీడియట్ మార్కుల్లో మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల తర్వాత మొదట వచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతోపాటు ఫీజు డబ్బులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

## డిసెంబర్ నాటికి పంప్‌హౌస్ పనులు పూర్తి చేయాలి



**చింతలపాలెం,ఫ్లాష్ ఇండియా :** కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకుని హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 53 వేల ఎకరాలకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద రూ.1,648 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను గురువారం మంత్రి పరిశీలించారు. అండర్ గ్రౌండ్ పంప్‌హౌస్ పనుల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 16 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్ల ద్వారా కృష్ణా జలాలను పంపింగ్ చేసి మొత్తం 53 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. మట్టంపల్లి మండలంలోని 9 గ్రామాల్లో 20,466 ఎకరాలు, మేళ్లచెరువు మండలంలోని 5 గ్రామాల్లో 15,829 ఎకరాలు, చింతలపాలెం మండలంలోని 9 గ్రామాల్లో 16,705 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన మొత్తం 19,295 కుటుంబాలు లబ్ధి పొందనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతుల నుంచి 191 ఎకరాల భూమిని సేకరించి, నష్టపరిహారంగా రూ.60 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. నాగార్జున సాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకుని ఈ ప్రాంతానికి సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి రూఫ్‌టాప్ లెవెల్, పంప్‌హౌస్ పనులను పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మిగిలిన పనులను కూడా వేగవంతం చేసి రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోర్తల సీతారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి కౌంటర్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయం అంతా 22-ఏ నిషేధిత భూముల చుట్టూ రంజుగా నడుస్తోంది. ఈ వివాదానికి బాధ్యతగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని భర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు ఇవాళ మాజీ మంత్రి హరీశ్ రావు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖను సైతం రాశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌తో పాటు హరీశ్ రావుకు మంత్రి పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీగా కూడా బీఆర్ఎస్ ఫెయిల్ అయిందని దుయ్యబట్టారు. ప్రతిపక్ష హోదాలో ఉండి అబద్దాలను పదే పదే చెబుతూ ప్రజల్లో ఆందోళనను రేకెత్తించడం తప్ప మీ వల్ల ప్రజలకు ఏలాంటి ఉపయోగం లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఇవాళ ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు చేశారు.

**హంతకుడే సంతాపం పెట్టినట్లు హరీశ్ తీరు:**

కమిషన్ల గురించి, అవినీతి గురించి హరీశ్ రావు మాట్లాడుతుంటే హంతకుడే సంతాపం తెలిపినట్లు ఉందని పొంగులేటి విమర్శించారు. పదేండ్లలో మీరు ఎలాంటి అవినీతికి పాల్పడ్డారో, స్వయంగా మీ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత అనేక సందర్భాల్లో వివరించిన విషయం మర్చిపోతే ఎలా హరీష్ రావు? అని నిలదీశారు. అవినీతి గురించి హరీష్ రావు నీతి వాక్యాలు చెబుతుంటే బీఆర్ఎస్ నేతలు కూడా నవ్వుకుంటున్నారన్నారు. రబ్బరు చెప్పులతో తిరిగిన అగ్గిపెట్టె రావు... పదేండ్లలో విచ్చలవిడిగా దోచుకునే కదా తరతరాలకు తిన్నా తరగని డబ్బు సంపాదించుకున్నారని ఆరోపించారు.

**ఆ సీక్రెట్ ఏంటో చెప్పు:**

మీ ఆర్థిక పరిపుష్టికి అవినీతే కదా ఆధారం... అధికారంలో ఉన్నప్పుడు ఏం కష్టపడ్డారో, ఎలాంటి వ్యాపారం చేశారో, అంత తక్కువ సమయంలో ఎవరికీ సాధ్యం కానంత డబ్బు ఎలా సంపాదించారో, ఆ రహస్యం ఏంటో ప్రజలకు వివరిస్తే బాగుంటుంది అగ్గిపెట్టె రావు అని సెటైర్లు వేశారు. కాళేశ్వరం, ధరణి నుండి మెడికల్ కాలేజీల వరకు అన్నింటిలోనూ దోచుకున్న బీఆర్ఎస్ నేతలు.. కమిషన్ల ప్రభుత్వమని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వారి పాలనలో కమీషన్ల మీద పనులు జరిగినట్టు ఈ ప్రభుత్వంలో కూడ జరుగుతుందనుకోవడం మీ భ్రమ అని మీ భ్రమను ప్రజలమీద రుద్దకండి అంటూ హితవు పలికారు. ఆనాడు అధికారంలో ఉండి పరిపాలనలో పూర్తిగా విఫలమయ్యారు. నేడు ప్రతిపక్షంలో ఉండి కూడా నిర్మాణాత్మకంగా వ్యవహరించకుండా, ప్రజల కోణంలో ఆలోచించకుండా... ప్రతిపక్ష పార్టీగా కూడా బీఆర్ఎస్ పార్టీ పనికిరాదని నిరూపిస్తున్నారన్నారు.

**22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి : మంత్రి పొంగులేటి ఆదేశం**

రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై గురువారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహశీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**వాస్తవాల నిర్ధారణ**

కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని మంత్రి ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు, తహశీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 22ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్



అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. "రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి" అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

**నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు**

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా.. క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశించే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ పరిసరాల్లోని జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్నారు. దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహిస్తారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లతో సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆ ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా మంత్రి ఈ సమీక్షలను నిర్వహించనున్నారు. రెవెన్యూ అంశాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, హౌజింగ్ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల, శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

# పీసీసీ చీఫ్ ఆగ్రహం

## నేనే ఎమ్మెల్యే అభ్యర్థి అంటే కుదరదు

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మిత, చిన్నారెడ్డి అది ఎవరైనా పార్టీ లైన్ దాటి మాట్లాడితే ఎంతటివారినైనా ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. ఇవాళ నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. సుస్మిత వ్యాఖ్యలపై ఇప్పటికే కొండా సురేఖను, తన వ్యాఖ్యలపై చిన్నారెడ్డిని వివరణ కోరామన్నారు. వీరు ఇచ్చే వివరణ తదనంతరం క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు ఉంటాయన్నారు. కొండా సూరేఖ, చిన్నారెడ్డి పార్టీలో సీనియర్ నాయకులని.. వీరంటే మా అందరికీ అందరికీ గౌరవమే కానీ పార్టీలో ఉన్నప్పుడు క్రమశిక్షణతో ఉండాల్సిందేనన్నారు.

**నేనే ఎమ్మెల్యే అభ్యర్థి అంటే కుదరదు:**

ఎన్నికలకు మరో రెండుళ్లు ఉండగానే పరకాల ఎమ్మెల్యే అభ్యర్థిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా ప్రకటిస్తారు? ఎవరు ఏం చెప్పినా రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేయబోయేది తానేనంటూ సుస్మితా చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. అభ్యర్థులు ఎవరు ప్రకటించినా అది చెల్లదని నేనే ఎమ్మెల్యే అభ్యర్థి అంటే కుదరదన్నారు. సీట్ల కేటాయింపు విషయంలో పార్టీలో ఒక విధానం ఉందని నాతో సహా అందరూ ఆ విధానానికి లోబడాల్సిందేనన్నారు. ఎవరికి వారు తమకు తామే సీటు ప్రకటించుకోవడం సరికాదన్నారు. ఎరుపు, పచ్చ కాంగ్రెస్ అంటూ ఏది లేదని పాత, కొత్త అందరు నేతల వల్ల పార్టీలి లబ్ధి చేకూరిందన్నారు.

**వారి వల్లే 22ఏ తప్పు:**

22ఏ లో మా తప్పు లేదని కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇది కింది స్థాయిలో జరిగిన తప్పు అని, ఈ పొరపాటు మా ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సరిచేసే ప్రయత్నానికి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇక పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలపై ఆయనతో మాట్లాడామని, పోచారం ఆవేదనను అర్థం చేసుకున్నామన్నారు.

# సుస్మిత వ్యాఖ్యలతో నాకేం సంబంధం?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టించిన కొండా సుశ్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి, మంత్రి కొండా సురేఖ రియాక్ట్ అయ్యారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తగత అభిప్రాయం అని పీసీసీ క్రమశిక్షణా కమిటీకి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై తనకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో గురువారం కొండా సురేఖ క్రమశిక్షణ కమిటీకి లేఖ రూపంలో వివరణ ఇచ్చారు. ఒకరి అభిప్రాయాలకు మరొకరు బాధ్యత వహించాలనడం, సుస్మిత వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. ఇది సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధం అని ఈ అంశంలో నా ప్రమేయం లేదని గుర్తించాలని వివరణ లేఖలో పేర్కొన్నారు. సుస్మిత వ్యాఖ్యలపై తనకు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని, కాంగ్రెస్ నాయకత్వంపై నాకు గౌరవం ఉందని పేర్కొన్నారు.

# బీజేపీ ఎంపీ సంచలన ఆరోపణలు!



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అంతా పొద్దస్తమానం భారతదేశంపై విద్వేషం వెళ్లగక్కేవారితో జరగబోతోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఈ పర్యటనలో భాగంగా రేవంత్ రెడ్డి వెళ్తున్న ప్రాంతాలు, కలుస్తున్న మనషులు అంతా యాంటీ ఇండియా, యాంటీ నేషనలిస్టుల ఐడియాలజీలు ఉన్న జార్జ్ సోరోస్ లాంటి వారు ఫండింగ్ చేసిన సంస్థలేనన్నారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం మీడియాతో మాట్లాడిన అర్వింద్.. రాష్ట్ర జాగ్రఫీ తెలియని వ్యక్తి, ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అని చెప్పిన వ్యక్తి విదేశాల్లో వెళ్లి ఏం మాట్లాడుతాడు అని ప్రశ్నించారు. మోడీ హయంలో భారత దేశంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటే నిద్రపట్టనటువంటి విద్యాసంస్థకు రేవంత్ రెడ్డి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై ప్రభుత్వం పూర్తి ఎజెండా ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఏం చేద్దామని యాంటీ ఇండియా స్కూల్‌కు ఎందుకు వెళ్తున్నావో చెప్పాలని డిమాండ్ చేశారు.

**రేవంత్ రెడ్డి మిమ్మల్ని కాపాడలేరు:**

ఐఏఎస్, ఐపీఎస్‌లు రాజకీయ నాయకుల వలలో పడవద్దని రాజశేఖర్ రెడ్డి హయాంలో అనేక మంది మంచి మంచి అధికారులు జైళ్లపాలయ్యారని.. వైఎస్సార్‌తో పోలిస్తే రేవంత్ రెడ్డి చాలా చిన్న వ్యక్తి. ఆయన మీ భవిష్యత్‌ను కాపాడలేరని అన్నారు. జీవితంలో కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాదని అధికారులను ఈ రేవంత్ రెడ్డి కాపాడలేరని అన్నారు. జీవన్ రెడ్డి జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గురించి రేవంత్ రెడ్డి కంటే తనకే ఎక్కువ తెలుసని అందుకే 2029లో తెలంగాణలో సూపర్ మెజారిటీతో బీజేపీ అధికారంలోకి రాబోతోందన్నారు. ఏమైనా చేస్తామని లీగల్‌గా చేసి అధికారంలోకి రాబోతోందన్నారు. పరిస్థితులు చూస్తుందే రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బాండ్ పేపర్ రాసి ఇవ్వాలనుందన్నారు.

# సంపాదకీయం

# రేపు మన వంతు

**తల్లిదండ్రులకు మనం ఇవ్వాల్సింది కేవలం డబ్బు కాదు.. గౌరవం**
**కేవలం మందులు కాదు.. మనసు**
**కేవలం ఇల్లు కాదు.. ఇంట్లో స్థానం**
**కేవలం ఫోన్ కాల్ కాదు.. ఆప్యాయత**




పిల్లలు పుట్టిన క్షణం నుంచే తల్లిదండ్రుల జీవితానికి కొత్త అర్థం మొదలవుతుంది.

తమ సుఖాలను, కోరికలను, అవసరాలను పక్కన పెట్టి పిల్లల భవిష్యత్తు కోసం జీవితాంతం శ్రమిస్తా-రు. మంచి చదువు, మంచి ఉద్యోగం, మంచి జీవితం అందించాలన్న తపనతో అప్పులు చేస్తారు, ఆస్తులు అమ్ముతారు, తమ కలలను త్యాగం చేస్తారు. పిల్లల సంతోషమే తమ సంతోషంగా భావిస్తారు. కానీ పిల్లలు పెద్దవారై తమ జీవితాల్లో స్థిరపడిన తర్వాత అదే తల్లిదండ్రులు ఒంటరితనంలోకి నెట్టబడటం సమాజం ఆలోచించాల్సిన విషాద వాస్తవం.ఇది కేవలం కుటుంబ సమస్య కాదు. ఇది మన సామాజిక వ్యవస్థలో వస్తున్న మార్పులకు అద్దం పట్టే అంశం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబం బలమైన సామాజిక భద్రతగా ఉండేది. వృద్ధాప్యం అంటే కుటుంబం మధ్యలో ఉండే దశ. ఇప్పుడు విద్య, ఉద్యోగం, వలసలు, నగరీకరణ, విదేశీ అవకాశాలు కుటుంబాలను భౌగోళికంగా విడదీస్తున్నాయి. పిల్లలు దూరంగా ఉండటం తప్పు కాదు. కానీ దూరం పెరిగిన కొద్దీ అనుబంధం కూడా తగ్గిపోవడం మాత్రం ప్రమాదకరం.

**తల్లిదండ్రులకు కావాల్సింది డబ్బు కాదు.. భరోసా**

పిల్లలను చిన్న వయసులోనే హాస్టళ్లకు పంపడం, ఉన్నత విద్య కోసం ఇతర నగరాలకు, విదేశాలకు పంపడం నేటి పరిస్థితుల్లో సాధారణమైంది. తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తు కోసం ఈ నిర్ణయాలను తీసుకుంటున్నారు. చదువు పూర్తవుతుంది. ఉద్యోగం వస్తుంది. ఆ తర్వాత పెళ్లి, కుటుంబం, పిల్లలు, బాధ్యతలు.. ఇలా వారి జీవితం పరుగులు తీస్తుంది.మరోవైపు పిల్లల కోసం జీవితమంతా శ్రమించిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పెద్ద ఇంట్లో ఒంటరిగా మిగిలిపోతున్నారు. ఇంట్లో ఆస్తి ఉంటుంది. బ్యాంకులో డబ్బు ఉంటుంది. పిల్లలు ప్రతి నెలా డబ్బు పంపుతారు. మందులు కొనిపిస్తారు. అవసరాలు తీర్చుతారు. కానీ అనారోగ్య సమయంలో పక్కన కూర్చొని మాట్లాడే మనిషి లేకపోతే ఆ సంపదకు అర్థం ఏమిటి?వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు కావాల్సింది కేవలం ఆర్థిక భద్రత కాదు. 'నా పిల్లలు నాకు ఉన్నారు' అనే మానసిక భరోసా. ఒక ఫోన్ కాల్, ఒక పలకరింపు, కొంత సమయం, అప్పుడప్పుడు ఒక ప్రత్యక్ష కలయిక.. ఇవే వారి జీవితంలో గొప్ప సంపద.

**పిల్లలను ఆస్తిగా చూడొద్దు.. తల్లిదండ్రులు కూడా మారాలి**

అయితే బాధ్యత ఒక్క పిల్లలదే అని చెప్పడం కూడా సరైంది కాదు. పిల్లలు పెద్దవారైన తర్వాత వారి జీవితాన్ని ప్రతి విషయంలో నియంత్రించాలనే తల్లిదండ్రుల ఆలోచన కూడా మారాలి. పిల్లలకు స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంది. ప్రేమ పేరుతో వారి జీవితాలను భారంగా మార్చకూడదు.తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కంటే కుటుంబ విలువలు, బాధ్యత, మానవత్వం నేర్పడం ముఖ్యం. పిల్లలను తమ వృద్ధాప్యానికి 'భద్రత'గా తయారు చేయడం కాదు.. మంచి మనుషులుగా తీర్చిదిద్దడం అసలు తల్లిదండ్రుల బాధ్యత.

**మీ సుఖం వెనుక వారి త్యాగం ఉంది**

పిల్లలు కూడా ఒక్కసారి వెనక్కి తిరిగి చూడాలి. ఈ రోజు తాము అనుభవిస్తున్న సౌకర్యాల వెనుక ఎవరి త్యాగం ఉంది? తమ చదువుకోసం తల్లిదండ్రులు చేసిన అప్పులు ఎంత? తమ కోసం వారు వదులుకున్న కోరికలు ఎన్నో? తమ భవిష్యత్తు కోసం వారు చేసిన కష్టానికి విలువ ఎంత?నెలకు ఒకసారి డబ్బు పంపించడం బాధ్యతను పూర్తిచేసినట్లేనా? డబ్బు అవసరం. కానీ డబ్బుతో తల్లిదండ్రుల ఒంటరితనాన్ని కొనలేం. దూరంగా ఉన్న పిల్లలు కనీసం ప్రతిరోజూ కాకపోయినా తరచుగా మాట్లాడాలి. వారి ఆరోగ్యం గురించి అడగాలి. వీలైనప్పుడు స్వయంగా వెళ్లి కలవాలి. మన పిల్లల కోసం సమయం కేటాయించగలిగితే, మనల్ని పెంచిన తల్లిదండ్రుల కోసం కూడా సమయం కేటాయించగలగాలి.కొన్ని సందర్భాల్లో విదేశాల్లో లేదా దూర ప్రాంతాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రులను దగ్గరగా చూసుకోలేని పరిస్థితులు నిజమే. ప్రతి కుటుంబ పరిస్థితి ఒకేలా ఉండదు. అందుకే సమస్యను కేవలం పిల్లలను నిందించే స్థాయిలో చూడకూడదు. కుటుంబం, సమాజం, ప్రభుత్వం కలిసి వృద్ధులకు గౌరవప్రదమైన జీవితం కల్పించే వ్యవస్థను నిర్మించాలి. వృద్ధాశ్రమాలు అవసరమైన వారికి ఆశ్రయం ఇవ్వవచ్చు. కానీ అవి పిల్లల బాధ్యతకు ప్రత్యామ్నాయంగా మారకూడదు.

**బంధాలను నిలబెట్టేది డబ్బు కాదు.. మానవత్వం**

మరణించిన తల్లిదండ్రుల అంత్యక్రియలకు కూడా పిల్లలు దూరంగా ఉండి డబ్బు పంపడం, వీడియో కాల్ ద్వారా చివరి కార్యక్రమాలను చూడటం వంటి ఘటనలు మనసును కలచివేస్తాయి. ఇవి ప్రతి కుటుంబానికి వర్తించే వాస్తవాలు కావు. అయినప్పటికీ కుటుంబ బంధాలు ఏ దిశగా వెళ్తున్నాయో ఆలోచించాల్సిన హెచ్చరికలు.సమాజాన్ని బలపరిచేది కేవలం ఆర్థిక వృద్ధి కాదు. మనుషుల మధ్య ఉండే అనుబంధం కూడా. సంపద పెరిగినా మానవ సంబంధాలు క్షీణిస్తే ఆ అభివృద్ధి అసంపూర్ణమే. తల్లిదండ్రుల జీవితమంతా పిల్లల భవిష్యత్తు కోసం త్యాగమైతే, వారి వృద్ధాప్యంలో పిల్లలు కొంత సమయం కేటాయించడం కనీస మానవత్వం.ఈ రోజు మనం మన తల్లిదండ్రులతో ఎలా ప్రవర్తిస్తున్నామో రేపు మన పిల్లలు కూడా అదే సంస్కారాన్ని మనకు తిరిగి చూపే అవకాశం ఉంది. అందుకే పిల్లలకు చదువు ఇవ్వాలి. సంపద ఇవ్వాలి. మంచి భవిష్యత్తు ఇవ్వాలి. కానీ అన్నింటికంటే ముందు మనిషిగా ఎలా ఉండాలో నేర్పాలి.తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో ఉంచడం కొన్నిసార్లు పరిస్థితుల వల్ల తప్పనిసరి కావచ్చు. కానీ వారిని మనసు నుంచి దూరం చేయడం మాత్రం ఎప్పటికీ సమర్థనీయం కాదు. తల్లిదండ్రులు పిల్లల కోసం తమ వర్తమానాన్ని త్యాగం చేశారు. ఇప్పుడు పిల్లలు వారి వృద్ధాప్యంలో తమ సమయాన్ని పంచుకోవాలి.బంధాలకు డబ్బు అవసరం కావచ్చు. కానీ బంధాలను నిలబెట్టేది ప్రేమ, సమయం, బాధ్యత, మానవత్వమే. తల్లిదండ్రులు వృద్ధాశ్రమంలో కాదు.. మనసులో ఉండాలి.




# ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎవరు?

దేశంలో రైల్వే వ్యవస్థను ఆధునికీకరిస్తున్నామని, ప్రపంచస్థాయి వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నాయి. వందేభారత్ రైళ్లు, ఆధునిక స్టేషన్లు, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, స్టేషన్ పునరాభివృద్ధి వంటి అంశాలు అభివృద్ధికి ప్రతీకలుగా ప్రచారం జరుగుతోంది. కానీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజా ఆడిట్ నివేదిక మాత్రం ఈ మెరుపుల వెనుక ఉన్న మరో వాస్తవాన్ని దేశం ముందుంచింది. రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవ-సరమైన కనీస సౌకర్యాలే ఇంకా అందుబాటులో లేవన్నది ఆ నివేదిక సారాంశం.దేశవ్యాప్తంగా 16 రైల్వే జోన్ల పరిధిలోని 512 నాన్-సబర్బన్ స్టేషన్లను కాగ్ పరిశీలిస్తే.. ఏకంగా 458 స్టేషన్లలో, అంటే 89 శాతానికి పైగా స్టేషన్లలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ప్రాథమిక సౌకర్యాలు లోపించినట్లు గుర్తించింది. ఎలాంటి లోపాలు లేని స్టేషన్లు కేవలం 54 మాత్రమే. ఇది కేవలం ఒక సంఖ్య కాదు.. కోట్లాది మంది రైల్వే ప్రయాణికుల రోజువారీ అనుభవానికి అద్దం పట్టే గణాంకం.ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే.. 2018లోనే అన్ని స్టేషన్లలో కనీస ప్రయాణికుల సౌకర్యాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశించినప్పుడు, ఏడేళ్లు గడిచినా లక్ష్యం ఎందుకు నెరవేరలేదు? రైల్వేకు నిధులు లేవా? లేక నిధుల వినియోగంలోనే సమస్య ఉందా? కాగ్ నివేదికలోని వివరాలు చూస్తే రెండో ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. 2019-20 నుంచి 2023-24 మధ్య ప్రయాణికుల సౌకర్యాల కోసం కేటాయించిన బడ్జెట్‌లో 36 నుంచి 44 శాతం వరకు ఖర్చు చేయకుండా మిగిలిపోయింది. ఐదేళ్లలో దాదాపు రూ.5,956 కోట్లు ఖర్చు కాలేదని కాగ్ గుర్తించింది.ప్రజల డబ్బుతో కేటాయించిన నిధులు ఒకవైపు ఖర్చు కాకుండా మిగిలిపోతుంటే.. మరోవైపు ప్రయాణికులు కనీస సౌకర్యాల కోసం ఇబ్బందులు పడటం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం కాదా? అభివృద్ధి అంటే భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ఒక ప్రయాణికుడికి పరిశుభ్రమైన తాగునీరు దొరకడం, మరుగుదొడ్డి అందుబాటులో ఉండటం, ఎండలో నిలబడకుండా ప్లాట్‌ఫామ్‌పై నీడ ఉండటం, వృద్ధులు కూర్చునేందుకు స్థలం ఉండటం కూడా అభివృద్ధిలో భాగమే.

**తాగునీటిపైనే తీవ్ర ఆందోళన**

కాగ్ నివేదికలో అత్యంత ఆందోళన కలిగించే అంశం తాగునీటి నాణ్యత. ప్రయాణికులకు అందించే నీటిని క్రమం తప్పకుండా పరీక్షించడంలో లోపాలు ఉన్నట్లు ఆడిట్ గుర్తించింది. కొన్ని ప్రాంతాల్లో క్లోరిన్ స్థాయిలు నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువగా లేదా ఎక్కువగా ఉన్నట్లు తేలింది. అంతేకాకుండా కొన్ని స్టేషన్లలో సేకరించిన నీటి నమూనాల్లో ఇ.కోలి, టోటల్ కోలిఫామ్ బ్యాక్టీరియా గుర్తించబడటం మరింత తీవ్రమైన విషయం.ప్రయాణికుడు రైల్వే స్టేషన్‌లో తాగుతున్న నీరు సురక్షితమా కాదా అనే విషయాన్ని తెలుసుకునే అవకాశం అతనికి ఉండదు. రైల్వే వ్యవస్థపై నమ్మకంతోనే నీరు తాగుతాడు. అలాంటి పరిస్థితిలో నీటి నాణ్యత విషయంలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే అది కేవలం పరిపాలనా లోపం కాదు.. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశం.

**ఎండ, వానల మధ్య ప్రయాణికుడి అవస్థలు**

రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫామ్ షెల్టర్లు కూడా మరో ప్రధాన సమస్యగా కాగ్ నివేదిక బయటపెట్టింది. 65 స్టేషన్లలో షెల్టర్లు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని, జనరల్ కోచ్‌లు ఆగే ప్రాంతాల్లో ప్రయాణికులను ఎండ, వాన నుంచి రక్షించడానికి సరిపడా షెల్టర్లు లేని స్టేషన్లు 379 ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఫుట్ ఓవర్‌బ్రిడ్జ్ నుంచి ప్లాట్‌ఫామ్ షెల్టర్ వరకు కప్పుతో కూడిన నడకదారి లేని 247 స్టేషన్లలో తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించింది.ప్రజలు రైలును పట్టుకోవడానికి పరుగెత్తుతూ ఎండలో కాలిపోవాలా? వర్షంలో తడవాలా? రైల్వే ప్రయాణికుడి కనీస గౌరవం కూడా ఈ ప్రశ్నలతో ముడిపడి ఉంది.

**దివ్యాంగుల విషయంలో మరింత నిర్లక్ష్యం**

సమాజంలో ప్రతి ఒక్కరికీ సమానమైన ప్రయాణ హక్కు ఉండాలి. కానీ దివ్యాంగ ప్రయాణికుల విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని కాగ్ నివేదిక చెబుతోంది. 512 స్టేషన్లలో 227 చోట్ల ర్యాంపులు లేవు. 297 స్టేషన్లలో దివ్యాంగులకు అనుకూలమైన నీటి ట్యాపులు లేవు. 134 స్టేషన్లలో దివ్యాంగులకు అనుకూలమైన టాయిలెట్లు లేవు. అత్యంత తీవ్రమైన విషయం ఏమిటంటే.. 490 స్టేషన్లలో ప్రత్యేక సీటింగ్ సదుపాయం లేదని నివేదిక పేర్కొంది.అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతున్నామని చెప్పుకునే సమయంలో, ఒక దివ్యాంగ ప్రయాణికుడు రైల్వే స్టేషన్‌లో సౌకర్యంగా కదలడానికి కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితిని ఎలా సమర్థించాలి? సమగ్ర అభివృద్ధి అంటే అందరికీ అందుబాటులో ఉండే మౌలిక వసతులు. ఆ సూత్రాన్ని రైల్వే మరింత గంభీరంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**పరిశుభ్రతపై ఖర్చు.. కానీ ఫలితం ఎక్కడ?**

రైల్వే పరిశుభ్రత కోసం ప్రతి ఏడాది భారీ మొత్తాలు ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని కాగ్ గుర్తించింది. 77 స్టేషన్లలో ప్లాట్‌ఫామ్‌లు, 128 స్టేషన్లలో వాటర్ బూత్‌లు, 165 స్టేషన్లలో టాయిలెట్లు మురికిగా ఉన్నట్లు ఆడిట్‌లో తేలింది. 301 స్టేషన్లలో వీధి కుక్కల సంచారం, 243 స్టేషన్లలో పాన్, గుట్కా మరకలు, 21 స్టేషన్లలో బహిరంగ మలవిసర్జన సమస్యగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.ఇక్కడ మరోసారి ప్రజల ప్రశ్న ముందుకొస్తోంది. శుభ్రత కోసం నిధులు కేటాయిస్తుంటే.. ఆ డబ్బు ఎక్కడ ఖర్చవుతోంది? పనులు జరుగుతున్నాయంటే వాటి నాణ్యతను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? కాంట్రాక్టులు ఇవ్వడం మాత్రమే సరిపోతుందా? ఫలితం ప్రయాణికుడికి కనిపించాలి కదా?

**వైద్యం విషయంలోనూ ప్రమాద ఘంటిక**

512 స్టేషన్లలో 441 స్టేషన్లలో ఎయిమ్స్ సిఫార్సుల మేరకు అత్యవసర వైద్య గదులు లేదా మెడికల్ బాక్సులు అందుబాటులో లేవని కాగ్ గుర్తించడం కూడా తీవ్రమైన అంశమే. రైల్వే స్టేషన్లు ప్రతిరోజూ వేలాది, లక్షలాది మంది ప్రయాణించే ప్రదేశాలు. వృద్ధులు, పిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణులు ఇలా అనేక వర్గాల ప్రజలు అక్కడ ఉంటారు. ఏదైనా ఆకస్మిక వైద్య అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించే వ్యవస్థ ఉండటం కనీస బాధ్యత.

**పెద్ద స్టేషన్లకూ మినహాయింపు లేదు**

న్యూఢిల్లీ, హౌరా, ముంబయి సెంట్రల్, సీఎస్ఎంటీ, అహ్మదాబాద్, చెన్నై సెంట్రల్, సికింద్రాబాద్ వంటి ప్రధాన స్టేషన్లలోనూ కనీస సౌకర్యాల లోపాలు ఉన్నట్లు కాగ్ నివేదిక పేర్కొనడం మరింత ఆలోచించాల్సిన విషయం. ప్రతిరోజూ భారీ ఆదాయం సమకూర్చే స్టేషన్లలోనే ప్రయాణికులకు నీరు, పారిశుధ్యం, ఫ్యాన్లు, కూలర్లు, సూచన బోర్డులు వంటి ప్రాథమిక వసతులు సరిగా లేకపోతే.. చిన్న స్టేషన్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

**పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయి?**

395 ప్రయాణికుల సౌకర్యాల ప్రాజెక్టులను సమీక్షించినప్పుడు 59 శాతం పనులు ఆలస్యమైనట్లు కాగ్ గుర్తించింది. కొన్ని పనులు మూడు, నాలుగు సంవత్సరాల వరకు ఆలస్యమైనట్లు నివేదిక వెల్లడించింది. అంటే సమస్య నిధుల కొరత మాత్రమే కాదు. ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ, బాధ్యత నిర్ణయించే వ్యవస్థల్లోనూ లోపాలున్నాయనే విషయం స్పష్టమవుతోంది.కాగ్ నివేదికను కేవలం విమర్శల పత్రంగా చూడకూడదు. ఇది వ్యవస్థలో ఎక్కడ లోపం ఉందో చూపించే అద్దం. ఆ అద్దంలో కనిపించిన లోపాలను సరిదిద్దడం ప్రభుత్వ బాధ్యత.

**రైల్వే శాఖ స్పందన సరిపోతుందా?**

కాగ్ నివేదిక అనంతరం రైల్వే మంత్రి, రైల్వే బోర్డు ఉన్నతాధికారులు నివేదికను సమీక్షించి సురక్షితమైన తాగునీటి కోసం వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని రైల్వే శాఖ ప్రకటించింది. బోర్డు స్థాయి నుంచి నేరుగా పర్యవేక్షిస్తామని కూడా తెలిపింది. ఇది స్వాగతించదగ్గ స్పందనే. అయితే ప్రకటనతో సమస్య పరిష్కారం కాదు. క్షేత్రస్థాయిలో మార్పు కనిపించాలి.ప్రజలకు కావాల్సింది మరో హామీ కాదు.. ఫలితం. రైల్వే స్టేషన్‌కు వెళ్లినప్పుడు శుభ్రమైన నీరు, పరిశుభ్రమైన టాయిలెట్, సరిపడా షెల్టర్, కూర్చునే స్థలం, దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు, అత్యవసర వైద్య సహాయం అందుబాటులో ఉండాలి. ఇవి విలాసాలు కావు. ప్రయాణికుడి ప్రాథమిక హక్కులకు సంబంధించిన సదుపాయాలు.

**ప్రజల మాట వినాల్సిన సమయం ఇది**

కాగ్ నివేదిక బయటకు తీసుకొచ్చిన అంశాలపై ప్రజల్లో సహజంగానే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోట్ల రూపాయల ఆదాయం వచ్చే స్టేషన్లలో కూడా కనీస సౌకర్యాలు ఎందుకు లేవు? కేటాయించిన నిధుల్లో వేల కోట్లు ఖర్చు కాకుండా ఎందుకు మిగిలాయి? ప్రా-జెక్టులు సంవత్సరాల తరబడి ఎందుకు ఆలస్యం అవుతున్నాయి? నీటి పరీక్షలు క్రమం తప్పకుండా ఎందుకు జరగడం లేదు? దివ్యాంగుల కోసం నిర్దేశించిన సౌకర్యాలు ఎందుకు పూర్తి కాలేదు? పరిశుభ్రత కోసం ఖర్చు చేస్తున్న డబ్బుకు ఫలితం ఎందుకు కనిపించడం లేదు?ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సింది కేవలం రైల్వే శాఖ మాత్రమే కాదు.. ప్రతి స్థాయిలో బాధ్యత వహించే అధికారులు కూడా.భారతీయ రైల్వే దేశ ఆర్థిక, సామాజిక జీవనాడి. కోట్లాది మంది ప్రజలు ప్రతిరోజూ దానిపై ఆధారపడుతున్నారు. అందుకే రైల్వే అభివృద్ధిని కేవలం కొత్త రైళ్లు, కొత్త ట్రాక్‌లు, భారీ స్టేషన్ భవనాలతో కొలవకూడదు. సాధారణ ప్రయాణికుడి అనుభవంతో కొలవాలి.కాగ్ నివేదిక ఒక హెచ్చరిక. దాన్ని రాజకీయ విమర్శగా కాకుండా పరిపాలనా దిద్దుబాటుకు అవకాశంగా చూడాలి. ప్రతి స్టేషన్‌లో కనీస సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా స్పష్టమైన గడువు, నిరంతర పర్యవేక్షణ, నిధుల సమర్థ వినియోగం, బాధ్యత నిర్ధారణ అవసరం. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, దివ్యాంగుల సౌకర్యాలు, ప్లాట్‌ఫామ్ షెల్టర్లు, వైద్య సదుపాయాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు.రైల్వే స్టేషన్ అంటే కేవలం రైలు ఎక్కే ప్రదేశం కాదు. అది సామాన్యుడి ప్రయాణానికి తొలి మెట్టు. ఆ మెట్టుపైనే కనీస సౌకర్యాలు లేకపోతే.. ఎంతటి ఆధునిక రైల్వే వ్యవస్థ గురించి మాట్లాడినా ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగులుతుంది.కాగ్ చూపించిన లోపాలను సరిదిద్దడమే ఇప్పుడు రైల్వే శాఖ ముందున్న అసలైన పరీక్ష. ప్రజలకు కావాల్సింది హామీల రైల్వే కాదు.. సౌకర్యాల రైల్వే.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# విధుల్లో చేరని వైద్యులు!




**ఉప్పునుంతల,ఫ్లాష్ ఇండియా :** ఉప్పునుంతల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యుల కొరత కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో జ్వరాలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర అనారోగ్య సమస్యలతో ప్రజలు పెద్ద సంఖ్యలో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఉప్పునుంతల సీహెచ్‌సీలో అవసరమైన స్థాయిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో జనరల్ సర్జరీ విభాగానికి డాక్టర్ డి. బాల్‌సింగ్, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ ఎస్. మోతిలాల్, పీడియాట్రిషియన్ (చిన్నపిల్లల వైద్య నిపుణుడు)గా ఉప్పునుంతల సీహెచ్‌సీలో విధులు నిర్వహించేందుకు అపాయింట్‌మెంట్ పొందారని తెలుస్తోంది. అయితే వారు ప్రస్తుతం పనిచేస్తున్న చోట రాజీనామా సమర్పించినప్పటికీ రిలీవింగ్ ఆర్డర్లు జారీ కాకపోవడంతో కొత్త పోస్టులో విధుల్లో చేరలేని పరిస్థితి ఏర్పడిందని సమాచారం. దీంతో ఒకవైపు వైద్యులు విధుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, మరోవైపు ఉప్పునుంతల సీహెచ్‌సీలో వైద్యుల కొరత కొనసాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విషయాన్ని ఆరోగ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి డాక్టర్ డి. బాల్‌సింగ్, డాక్టర్ ఎస్. మోతిలాల్‌లను వీలైనంత త్వరగా రిలీవ్ చేయించి, ఉప్పునుంతల సీహెచ్‌సీలో వారు తక్షణమే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఇద్దరు వైద్యులు విధుల్లో చేరితే జనరల్ సర్జరీతో పాటు చిన్నపిల్లల వైద్య సేవలు కూడా స్థానిక ప్రజలకు అందుబాటులోకి వస్తాయని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుత సీజనల్ వ్యాధుల సమయంలో గ్రామీణ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చొరవ తీసుకుని, అపాయింట్‌మెంట్ పొందిన ఈ ఇద్దరు వైద్యులు ఎటువంటి ఆలస్యం లేకుండా విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. "వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ రిలీవింగ్ ఆర్డర్ల కారణంగా ప్రజలకు సేవలు అందకుండా ఉండకూడదు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## చర్యలు ఉంటాయా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో వారం రోజుల క్రితం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ ప్రాంతంలో ఈగల్ అధికారులు నిర్వహించిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. సోదాలకు వెళ్లిన ఈగల్ అధికారులపై గంజాయి స్మగ్లర్లు బొల్ల దుర్గాప్రసాద్, కిరణ్ కుమార్, కమలాకర్‌లు కుక్కలను వదిలి, స్క్రూడ్రైవర్‌తో దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. అయితే, ఈగల్ అధికారుల సోదాల సమయంలో స్మగ్లర్ల డెన్‌లో పలువురు కానిస్టేబుళ్లు కల్లు తాగడం, 2024 బ్యాచ్‌కు చెందిన ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్ తన మ్యాన్‌ప్యాక్‌ను అక్కడే రెండు రోజుల పాటు వదిలేసి ఉండటం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో గంజాయి స్మగ్లర్ల డెన్‌తో పోలీసులకు ఉన్న సంబంధాలపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ గంజాయి స్మగ్లర్లు పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తూ పలు చోరీ కేసుల్లో దొంగలను పట్టించడంలో సహకరించారని, తద్వారా పోలీసులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని ప్రచారం జరుగుతోంది. పోలీసులతో దోస్తీ పెరగడంతో తమ డెన్‌లో పోలీసులు ఎప్పుడు దావత్ చేసుకోవాలన్నా స్మగ్లర్లు ఏర్పాట్లు చేసేవారని కూడా సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉండటంతో పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించినట్లు తెలుస్తోంది. గంజాయి స్మగ్లర్లకు, పోలీసులకు మధ్య ఉన్న సంబంధాలపై ఈగల్ అధికారులు ఓ నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం. అదే విధంగా కూకట్‌పల్లి జోన్ డీసీపీ కూడా ఏసీపీతో విచారణ జరిపించి మరో నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ రెండు నివేదికలు సైబరాబాద్ పోలీసు కమిషనర్ ముందున్నట్లు సమాచారం. నివేదికల ఆధారంగా గంజాయి స్మగ్లర్లతో దోస్తీ ఉన్న ఎస్ఐతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లపై చర్యలు ఉంటాయా? లేక ఎస్ఐని తప్పించి కేవలం కానిస్టేబుళ్లపైనే చర్యలు తీసుకుంటారా? అనే చర్చ సైబరాబాద్ పోలీసు వర్గాల్లో ఆసక్తికరంగా సాగుతోంది. ఈ వ్యవహారంలో సీపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

# హోటల్‌లో అగ్నిప్రమాదం..

**కీసర,ఫ్లాష్ ఇండియా :** కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీసర–ఈసీఐఎల్ ప్రధాన రహదారిపై ఉన్న సరవణ సుప్రభాత్ హోటల్‌లో గురువారం తెల్లవారుజామున సిలిండర్ లీకేజీ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జేసీ ఆటోమొబైల్స్ (హీరో) షోరూం ఎదురుగా ఉన్న హోటల్‌లో గ్యాస్ సిలిండర్ నుంచి లీకేజీ కావడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించి మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలోని వాహనదారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే కీసర సీఐ ఆంజనేయులు పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి సంఘటనా స్థలానికి పంపించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిసర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

**ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లతో మంటల అదుపు**

హోటల్‌కు ఎదురుగా ఉన్న జేసీ ఆటోమొబైల్స్ (హీరో) షోరూంలో అత్యవసర పరిస్థితుల కోసం అందుబాటులో ఉంచిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను ఉపయోగించి పోలీసులు, షోరూం సిబ్బంది, స్థానికులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం నీటిని ఉపయోగించి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. కొద్దిసేపటికే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

**ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి: సీఐ**

ఈ సందర్భంగా సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ హోటళ్లు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సిలిండర్లు, గ్యాస్ పైప్‌లైన్లు, ఇతర పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచడంతో పాటు వాటి వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు, షోరూం సిబ్బంది, స్థానికులు సకాలంలో స్పందించడంతో మంటలు త్వరగా అదుపులోకి వచ్చి పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గ్యాస్ లీకేజీకి గల కారణాలు, ఆస్తి నష్టం తదితర వివరాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ..

**మంథని,ఫ్లాష్ ఇండియా :** మంథని మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇంతకాలం ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడిన ప్రజలు, వాహనదారులకు రానున్న రోజుల్లో సమస్యలు తొలగనున్నాయి. రోడ్డు రవాణా సులభతరం కానుంది. రోడ్ల అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల పల్లెల అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మొదటి దశలో హైమ్ పథకం కింద గ్రామీణ రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. దీంతో పల్లె రోడ్ల వెడల్పు నిర్మాణంతో ప్రజలకు, ప్రయాణికులకు రవాణా సుగమం కానుంది. దీంతో ఆయా గ్రామీణ ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

**హైమ్ పథకం కింద నిధులు మంజూరు...**

మండలంలో మొదటి దశలో హైమ్ పథకం కింద సూరయ్యపల్లి నుంచి కాకర్లపల్లి మీదుగా శుక్రవారం పల్లి వరకు సుమారు 10.9 కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి రూ. 29.94 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అదే విధంగా గుంజపడుగు నుంచి విలోచవరం మీదుగా ఉప్పట్ల, పోతారం వరకు రూ. 8.78 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. ఇన్నేళ్లుగా ఇరుకుగా ఉన్న రోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు కావడంతో సమస్యలు తొలగనున్నాయి.

**మంత్రుల చేతుల మీదుగా రోడ్డు పనులకు శంకుస్థాపన..**

మొదటి దశలో హైమ్ పథకం కింద మంజూరైన సూరయ్యపల్లి నుంచి కాకర్లపల్లి మీదుగా శుక్రవారం పల్లి వరకు సుమారు 10.9 కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి రూ. 29.94 కోట్లు, అదే విధంగా గుంజపడుగు నుంచి విలోచవరం మీదుగా ఉప్పట్ల, పోతారం వరకు రూ. 8.78 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

**పల్లె రోడ్లకు పట్టణ రోడ్డు కనెక్టివిటీ..**


సూరయ్యపల్లి నుంచి సీతంపల్లి వరకు రోడ్డు వెడల్పు నిర్మాణం పూర్తయితే భూపాలపల్లి నుంచి తాడిచర్ల మీదుగా గ్రామాలను కలుపుకుంటూ మంథనికి రవాణా మార్గం సులభం కానుంది. అదే విధంగా ఓడేడ్ వద్ద



వంతెన పూర్తయితే అటు నుంచి వరంగల్, భూపాలపల్లి, హుజురాబాద్ నుంచి ముత్తారం మీదుగా ఖమ్మంపల్లి, రామకృష్ణాపూర్ నుంచి మంథనికి రవాణా మార్గం సులభం కానుంది. ముఖ్యంగా రోడ్డు రవాణా సులభం కావడానికి రోడ్డు కనెక్టివిటీ అత్యంత కీలకం. పల్లె రోడ్లను పట్టణ ప్రాంతాలతో అనుసంధానం చేయడం వల్ల దూరభారంతో పాటు ప్రయాణ సమయం, ఖర్చులు తగ్గుతాయి. దీంతో పాటు ప్రజలకు మరిన్ని ప్రయోజనాలు చేకూరనున్నాయి.

# చదువుల బాటలో కంకర ముళ్లు






**మర్పల్లి,ఫ్లాష్ ఇండియా :** వర్షాలకు కొట్టుకుపోయిన తారు.. ఎక్కడికక్కడ తేలిన మొనదేలిన కంకర రాళ్లు.. అడుగడుగునా గోతులు.. ఇదీ మర్పల్లి మండల పరిధిలోని రావులపల్లి––కుడుగుంట రహదారి దుస్థితి. అధికారుల ఉదాసీనతకు నిలువెత్తు నిదర్శనంగా మారిన ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. చివరకు రవాణా వాహనాలు కూడా గ్రామంలోకి వచ్చేందుకు నిరాకరిస్తుండటంతో, విద్యార్థులు నిత్యం రాళ్లబాటపై నడుస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా ఛిద్రమైంది. రోడ్డుపై పెద్ద ఎత్తున కంకర తేలి ఉండటంతో కుడుగుంట గ్రామానికి రావడానికి ఆటోలు, ప్రైవేటు వాహనాల డ్రైవర్లు ససేమిరా అంటున్నారు. దీంతో గ్రామానికి చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బడులు, కాలేజీలకు వెళ్లడానికి విద్యార్థులు నిత్యం రావులపల్లి ప్రధాన చౌరస్తా వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర కంకర రోడ్డుపైనే కాలినడకన ప్రయాణించాల్సి వస్తోంది. రోజూ కిలోమీటర్ల కొద్దీ నడవాల్సి రావడంతో తీవ్ర అలసటకు గురవుతున్నామని, సమయానికి తరగతులకు హాజరు కాలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మొరపెట్టుకున్నా పట్టించుకోని వైనం**

రహదారి సమస్యపై కుడుగుంట గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా అర్జీలు సమర్పించినా ఫలితం శూన్యంగా మారింది. సమస్య తీవ్రత తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అధికారుల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును, గ్రామీణ ప్రజల రవాణా కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన రావులపల్లి–కుడుగుంట రహదారికి మరమ్మతులు చేపట్టి, రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.




## మంత్రి పొంగులేటికి సవాల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి శ్రీనివాస రెడ్డికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి నిన్న (బుధవారం) సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరుకున్నారు. తన సవాల్‌ను స్వీకరించి చర్చకు రావాలని మంత్రిని ఏలేటి మరోసారి డిమాండ్ చేశారు. తాను మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉంటానని, శ్రీనివాస రెడ్డి రావాలని డెడ్ లైన్ విధించారు. ఈ సందర్భంగా భూభారతి, 22ఏలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థలకు భూ బదలాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు తాను కదిలేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇస్తారా? లేక పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇస్తారా? అంటూ సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఎవరొచ్చినా సరే తన వద్ద ఉన్న ఆధారాలను అందిస్తానని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్ టు హాంగ్‌కాంగ్..

**ఐటీ దాడుల్లో రూ.1000 కోట్ల హవా లావాదేవీల గుట్టురట్టు..**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశాలకు నిధుల తరలింపులో భారీ అవకతవకలు జరిగాయనే అనుమానాలతో ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ దేశవ్యాప్తంగా విచారణ వేగవంతం చేసింది. అందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించి, రూ. 1,000 కోట్ల విదేశీ చెల్లింపులపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించింది. డేటా విశ్లేషణ, క్షేత్రస్థాయి నిఘా ఆధారంగా హైదరాబాద్‌లో 9, విశాఖపట్నంలో 3, గుంటూరులో ఒక ప్రాంతంలో ఐటీ బృందాలు ఈ తనిఖీలు చేపట్టాయి. హాంకాంగ్, సింగపూర్, యూకే, చైనా, ఇండోనేషియా వంటి దేశాల్లోని సంస్థలకు భారీగా నిధులు మళ్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న 'స్టాక్‌పైల్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థపై ఐటీ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ ఒక్క సంస్థ నుంచే సుమారు రూ. 900 కోట్ల విదేశీ చెల్లింపులు జరిగినట్లు గుర్తించి, కంపెనీ డైరెక్టర్లు దీపక్ నంబరు, మాధవ రామ్ పొనపల్లి నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేశారు. అలాగే గుంటూరులోని అరుండల్‌పేటకు చెందిన ఒక వ్యక్తి ప్రాంగణంలో జరిగిన సోదాల్లో రూ. 130 కోట్ల విలువైన లావాదేవీలకు సంబంధించిన 15 అనుమానాస్పద సర్టిఫికెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్, రవాణా సేవల పేరుతో ఈ చెల్లింపులు జరిపినట్లు చూపుతున్నప్పటికీ, ఆయా సేవలు నిజంగా అందాయా లేదా కొన్ని ఉనికిలో లేని షెల్ కంపెనీలకు నిధులు తరలించారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఈ అక్రమ నిధుల మళ్లింపు ప్రక్రియలో ఫామ్ 15జదీ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసిన వృత్తి నిపుణుల పాత్రపై కూడా అధికారులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. హైదరాబాద్‌లో ఒక



చార్టర్డ్ అకౌంటెంట్ , ఒక కంపెనీ సెక్రటరీ నివాసాల్లో సోదాలు నిర్వహించి పత్రాలను పరిశీలించారు. చాలా తక్కువ వ్యాపార టర్నోవర్ ఉన్న సంస్థలు, అసలు ఐటీ రిటర్నులు దాఖలు చేయని కంపెనీలు కూడా భారీ మొత్తంలో విదేశీ రెమిటెన్సులు జరిపినట్లు డేటా విశ్లేషణలో తేలింది. తక్కువ సంఖ్యలో ఉన్న కొందరు నిపుణులే అత్యధిక సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ చేసి, ఈ నిధులను కొన్ని ప్రత్యేక విదేశీ సంస్థల సమూహాలకే పంపినట్లు ఆధారాలు లభించాయి. గతంలో నకిలీ ధార్మిక ట్రస్టుల ద్వారా జరిగిన అకామిడేషన్ ఎంట్రీల దర్యాప్తు నుంచి ఈ విదేశీ చెల్లింపులకు సంబంధించిన కీలక లింకులు బయటపడ్డాయి. దేశవ్యాప్తంగా ఆగస్టు 18న ప్రారంభమైన ఈ ప్రత్యేక ధ్రువీకరణ ప్రక్రియలో భాగంగా మొత్తం 394 సంస్థలు, 36 మంది వృత్తి నిపుణులపై ఐటీ శాఖ నిఘా పెట్టింది. వీటిలో భూ సరిహద్దు రాష్ట్రాలకు చెందిన 117 సంస్థలు కూడా ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాలు, పన్ను పత్రాల విశ్లేషణ పూర్తయిన తర్వాత ఈ విదేశీ చెల్లింపుల వెనుక ఉన్న అసలు మాస్టర్‌మైండ్ వివరాలు బయటకు రానున్నాయి.

# బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయ ముట్టడి

**నల్గొండ,ఫ్లాష్ ఇండియా :** నకిరేకల్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల కారణంగా మోటార్లు కాలిపోయి పంటలు ఎండిపోతున్నాయనే ఆవేదనతో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. పంటల సీజన్ మొదలైనప్పటి నుంచి విద్యుత్ సమస్యల విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు నిరంతర విద్యుత్‌ను అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించి విద్యుత్ సరఫరాను



సక్రమంగా అందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దూదిమెట్ల సత్తయ్య యాదవ్, చిరుమర్తి యాదయ్య, మేకల రాజిరెడ్డితో పాటు 200 మంది రైతులు పాల్గొన్నారు.

# డ్రాగన్ ఫ్రూట్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలి



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** డ్రాగన్ ఫ్రూట్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.గురువారం, జిల్లాలోని నర్మెట్ట మండలం, గుంటూరుపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యటించి, రైతు వెలంగన్ రెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. రైతు మూడు ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్‌ను ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్ తోటలో మొక్కల పెరుగుదల, పూత వచ్చే విధానం, పంట దిగుబడి, సాగు ఖర్చులు, మార్కెట్ ధరలు, తదితర అంశాలపై కలెక్టర్ రైతుతో వివరంగా మాట్లాడారు.పంట సాగుకు ప్రభుత్వం నుంచి అందిన సబ్సిడీ ఎంత, సబ్సిడీ ద్వారా ఎలాంటి ప్రయోజనం పొందారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను ఏ సైజులో కట్ చేస్తారు, కత్తిరింపు విధానం ద్వారా మొక్కల పెరుగుదలను ఎలా నియంత్రిస్తున్నారు, కలుపు మొక్కలు రాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు అనే అంశాలపై కూడా ఆరా తీశారు. తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ పనితీరును కూడా పరిశీలించి, మొక్కలకు అవసరమైన మేరకు నీటిని అందించే విధానం, నీటి వినియోగ సామర్థ్యం, తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.అలాగే డ్రాగన్ ఫ్రూట్ మొక్కలకు పూత ఎలా వస్తుంది, పూత వచ్చిన తర్వాత ఎన్ని రోజులకు కాయలు కోతకు వస్తాయి, ప్రస్తుతం పంటకు మార్కెట్‌లో లభిస్తున్న ధర ఎంత అనే విషయాలపై కలెక్టర్ రైతుతో చర్చించారు. ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ, ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తున్న రైతు వెలంగన్ రెడ్డి అనుభవాలను కలెక్టర్ ఆసక్తిగా తెలుసుకున్నారు.తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల, అధిక విలువ కలిగిన ప్రత్యామ్నాయ పంటలను రైతులు స్వీకరించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలు, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సాగులో డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ పద్ధతులు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, ఇతర సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలి



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.గురువారం, జిల్లాలోని నర్మెట్ట మండలం, ఇప్పలగడ్డ గ్రామంలోని (పూర్వ ప్రాథమిక పాఠశాల) అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలను, వసతులను పరిశీలించి, టీచర్, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి ఎంత మంది చిన్నారులు హాజరవుతున్నారో కలెక్టర్ ఆరా తీశారు. చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న దుస్తులు పంపిణీ చేశారా? అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.చిన్నారులకు నిర్ణీత సమయానికి పౌష్టికాహారం అందించాలని, వంటల తయారీలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. చిన్నారుల బరువును క్రమం తప్పకుండా కొలిచి, నమోదు చేయాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు.అంగన్వాడీ భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, కేంద్రంలో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న మరో గది రేకులు కూలిపోయి ఉండటాన్ని గమనించిన కలెక్టర్, వాటిని వెంటనే సరిచేయించాలని అక్కడి గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషణపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి మెరుగైన సేవలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఉప సర్పంచ్ సురేష్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు..






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత రత్న,స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.మొదట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రాజీవ్ భవన్) నందు రాజీవ్ గాంధీ చిత్రపటానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని హౌసింగ్ బోర్డు ఎస్పీ కన్వెన్షన్ నందు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ,ఎస్ ఐ ఆర్ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్ బల్మూర్ వెంకట్,పార్లమెంట్ కోఆర్డినేటర్ కస్బ శ్రీనివాస్ రావు,డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత హాజరయ్యారు.

**రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే బిఎల్ఆర్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ“భారతదేశాన్ని ఆధునిక, సాంకేతికతతో కూడిన దేశంగా తీర్చిదిద్దడంలో రాజీవ్ గాంధీ కీలకమైన పాత్ర పోషించారన్నారు. యువతకు ప్రాధాన్యత,విద్య, సాంకేతిక రంగాల అభివృద్ధి, కంప్యూటర్ మరియు టెలికమ్యూనికేషన్ రంగాల్లో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు నేటి ఆధునిక భారతదేశానికి బలమైన పునాదులు వేశాయి అన్నారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని నమ్మిన రాజీవ్ గాంధీ ఆలోచనలు నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు.గ్రామీణ స్థాయి నుంచి దేశ అభివృద్ధి వరకు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తపై ఉంది తెలిపారు..రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకోవడంతో పాటు, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, యువతకు మెరుగైన భవిష్యత్తు,సాంకేతిక అభివృద్ధి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గం బి ఎల్ ఎ లతో కృతజ్ఞత సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం విజయవంతం కావడంలో నియోజకవర్గంలోని బి ఎల్ ఎ లు క్షేత్రస్థాయిలో చేసిన కృషి, సమన్వయం,అంకితభావం అభినందనీయం అని పేర్కొన్నారు.పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి కార్యకర్త, ప్రతి బి ఎల్ ఎ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.ప్రజలకు, పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తున్న బి ఎల్ ఎ ల సేవలను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తాం అన్నారు.రాబోయే రోజుల్లో కూడా ఇదే ఐక్యత, సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేద్దాం అని ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ అన్నారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు, బి ఎల్ ఎ లు,పార్టీ కార్యకర్తలు మరియు ఇతరులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ,వైస్ చైర్మన్,గుడిపాటి శిరీష నవీన్,మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు,ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు,కౌన్సిలర్లు, ఇంచార్జులు,బి ఎల్ ఎలు,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీ -సేవ ఆన్లైన్ స్కిల్ సెంటర్ల ఫ్రాంచైజీ కొరకు అప్లై చేసుకోండి




**కోడేరు/నాగర్‌కర్నూల్ ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, సిటీ స్థాయిల్లో టీ–సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కేంద్రాల ద్వారా వినియోగదారులకు వివిధ రకాల ఆన్‌లైన్ సేవలను అందించడంతోపాటు, అభ్యర్థులు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మరిన్ని వివరాల కోసం సంప్రదించండి:**
**90638 59581**



# వార్డుల్లో కమిషనర్ పర్యటన

**తడి, పొడి చెత్తపై అవగాహన..**
**వార్డుల్లో కమిషనర్ పర్యటన**
**వార్డుల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలన**
**చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్‌లను పరిశీలించిన కమిషనర్**

**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఈరోజు జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి గారు ఒకటో వార్డు కౌన్సిలర్ దుర్గ ప్రసాద్ గారు మరియు రెండవ వార్డ్ కౌన్సిలర్ విజయ్ గారితో 1వ , 2వ వార్డులో తడి చెత్త పొడి చెత్త అవగాహన వార్డులోని సమస్యలు పరిష్కరించేందుకు వార్డులలో తిరగడం జరిగింది చిల్డ్రన్ పార్క్ ఓపెన్ జిమ్ పట్టణ ప్రకృతి వనం ఇండస్ట్రియల్ ఏరియా మొదలగు ప్రాంతాలను కూడా తిరిగి వాటి గురించిన వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది



# నిరుపయోగంగా మారిన ఫర్టిలైజర్ యాప్

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

గతంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ రద్దు చేయాలని హైకోర్టులో పిల్ వేసిన నల్గొండ జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి గురువారం మిర్యాలగూడలో ఒక ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ ఎక్కువ శాతం రైతులు నిరక్షరాసులు కావడం వల్ల రైతులు నష్టపోతున్నారని, ఆ యాప్ నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.




# ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలి..



డీ–8 కెనాల్ పరిధిలో పర్యటించిన మంత్రి జూపల్లి కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదలపై ఆరా

**కొల్లాపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ–8 కెనాల్ పరిధిలోని కాల్వలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బైక్‌పై తిరుగుతూ స్వయంగా పరిశీలించారు. తూడుకుర్తి దగ్గర ప్రధాన కాల్వ నుండి సాకలి పల్లి, ఏదుట్ల, గోపాలపేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులపురం కాల్వలను పరిశీలించి నీటి ప్రవాహం, కాల్వల పరిస్థితిని పర్యవేక్షించారు.కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేస్తున్న నీరు, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటిపారుదల శాఖ అధికారులను మంత్రి ఆరా తీశారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు చేరుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టుకోవాలని మంత్రి సూచించారు. నీటిని ఏమాత్రం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ అధిక విస్తీర్ణంలో పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల, నీటి ప్రవాహం, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటిపారుదల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. నీరు వృథా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయకట్టు చివరి భూములకు సైతం సక్రమంగా నీరు అందేలా చూడాలని సూచించారు.మంత్రి వెంట వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ , కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్ రావు, సాగునీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

# భూ నిర్వాసితులకు రూ.కోటి విలువైన పరిహారం చెక్కుల పంపిణీ..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని అడవిదేవులపల్లి మండలంలో నిర్మిస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారంలో భాగంగా గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 30 మంది భూ నిర్వాసితులకు మొత్తం రూ.కోటి విలువైన పరిహారం చెక్కులను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్), ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి లు కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల కోసం భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల ప్రయోజనాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా పరిగణిస్తోందన్నారు.భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలు మరింత మెరుగుపడి,రైతులకు ఎంతో ప్రయోజనం



చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రాజెక్టు నిర్మాణంతో పాటు భూ నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.భూ నిర్వాసితులకు పరిహారం అందించే ప్రక్రియను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్న అధికారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. అర్హులైన ప్రతి భూ నిర్వాసితుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.




# హార్దిక్ పాండ్యా ట్రేడ్ రూమర్స్..

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడ్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. హార్దిక్‌ను ముంబై ఇండియన్స్ మరో ఫ్రాంచైజీకి ట్రేడ్ చేయనుందంటూ ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు అతడిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయని.. మరోవైపు గుజరాత్ టైటాన్స్ టీంలోకి వెళ్లేందుకు హార్దిక్ సముఖంగా ఉన్నాడంటూ న్యూస్ వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ముంబై ఫ్రాంచైజీ తన సోషల్ మీడియాలో హార్దిక్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను పోస్ట్ చేయడం ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. హార్దిక్ పాండ్యా 2015లో ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ముంబై జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగిన హార్దిక్.. 2022 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ జట్టులోకి వెళ్లాడు. తొలి సీజన్‌లోనే టైటాన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించి.. జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు. ఆ తర్వాత సీజన్‌లో కూడా గుజరాత్‌ను ఫైనల్ వరకు చేర్చాడు. 2024లో హార్దిక్‌ను ముంబై ట్రేడింగ్ విండో ద్వారా తిరిగి జట్టులోకి తీసుకుంది. ముంబైకి తిరిగి వచ్చిన హార్దిక్‌కు జట్టు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. అయితే అతడి నాయకత్వంలో 2024 జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి సీజన్‌లో ప్లేఆఫ్స్‌లో క్వాలిఫయర్-2 వరకు చేరుకున్నప్పటికీ.. 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసే అవకాశాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఐపీఎల్ ట్రేడింగ్ విండోకు సంబంధించిన చర్చలు జరుగుతున్న సమయంలో ముంబై ఇండియన్స్ హార్దిక్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈ పోస్టు ద్వారా హార్దిక్ ట్రేడ్‌పై వస్తున్న వార్తలకు చెక్ పెట్టినట్లే కనిపిస్తోంది. 'హార్దిక్ ఎక్కడికి వెళ్లడం లేదు, ముంబైలోనే ఉంటాడు' అని ఎంఐ చెప్పకనే చెప్పింది. ముంబై పోస్ట్‌పై అభిమానులు కూడా స్పందిస్తున్నారు. ముంబైలోనే హార్దిక్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే హార్దిక్ ట్రేడ్‌కు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియా పోస్టుతో అభిమానుల్లో కొత్త చర్చ మొదలైనప్పటికీ.. హార్దిక్ ముంబైలోనే కొనసాగుతాడా? లేదా అన్నది అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# శ్రీలంకకు ట్రిపుల్ షాక్..



గాలె వేదికగా భారత్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక 165 పరుగుల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఇక కొలంబో వేదికగా రెండో టెస్ట్ ఆగస్ట్ 23 నుంచి ఆరంభం కానుంది. సొంత గడ్డపై మొదటి టెస్టులో ఇప్పటికే కంగుతిన్న శ్రీలంకకు.. రెండో టెస్టుకు ముందు డబుల్ షాక్ తగిలింది. స్టార్ ఆటగాళ్లు దినేష్ చండిమాల్, కుశాల్ మెండిస్ అందుబాటులో లేకుండా పోయారు. ఈ విషయాన్ని శ్రీలంక హెడ్ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ వెల్లడించాడు. పాథుమ్ నిస్సాంక కూడా తదుపరి టెస్టుకు దూరం కానున్నట్లు తెలిపాడు. దీంతో భారత్‌తో రెండో టెస్టుకు సిద్ధమవుతున్న శ్రీలంకకు భారీ షాక్ తగిలింది. కుశాల్ మెండిస్‌కు హ్యామ్‌స్ట్రింగ్ గాయం తీవ్రంగా ఉందని గ్యారీ కిర్‌స్టెన్ తెలిపాడు. అతడు కొన్ని రోజుల పాటు జట్టుకు అందుబాటులో ఉండే ఉండడని చెప్పాడు. తొడకండరాల గాయంతో ఓపెనర్ పాథుమ్ నిస్సాంక రెండో టెస్టులో ఆడడం లేదు. తొలి టెస్టులో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దినేష్ చండిమాల్ గాయపడ్డాడు. అతడి తల, మెడకు గాయమైంది. మైదానంలోనే అస్వస్థతకు గురికావడంతో.. వెంటనే ఆస్పత్రికి తరలించారు. చండిమాల్ స్థానంలో పాసిందూ సూర్యబండార కన్కషన్ సబ్‌స్టిట్యూట్‌గా ఆడాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండడంతో.. వైద్యుల సలహా మేరకు చండిమాల్‌ను రెండో టెస్టు నుంచి తప్పించారు. దినేష్ చండిమాల్, పాథుమ్ నిస్సాంక, కుశాల్ మెండిస్‌లు దూరం కావడం యువ క్రికెటర్లకు మంచి అవకాశంగా మారుతుందని గ్యారీ కిర్‌స్టెన్ అభిప్రాయపడ్డాడు. 'దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మంచి రికార్డులు ఉన్న ఆటగాళ్లకు జాతీయ జట్టులో తమ సత్తా నిరూపించుకునే అవకాశం లభిస్తుంది. తొలి టెస్టులో భారత్ చేతిలో ఓడిపోయినప్పటికీ.. శ్రీలంక ఆటగాళ్లు టెస్టు క్రికెట్‌లో చూపిన పోరాట పటిమను చూపించడం సంతోషంగా ఉంది. శ్రీలంక క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారు. అయితే టెస్టు క్రికెట్‌లో జట్టు ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. టెస్టు క్రికెట్‌ను ఎక్కువగా ఆడకపోవడం వల్ల ఈ ఫార్మాట్‌లో ఎలా ఆడాలో అర్థం చేసుకోవడం కొంత కష్టంగా ఉంటుంది. రాబోయే రోజుల్లో జట్టులో మరింత మెరుగైన ప్రదర్శన తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాము' అని కిర్‌స్టెన్ తెలిపాడు. 'గాలె టెస్టులో ఒక దశలో శ్రీలంక 99 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. అయినప్పటికీ కోలుకుని మ్యాచ్‌ను ఐదో రోజు మధ్యాహ్నం వరకు తీసుకెళ్లడం సానుకూల అంశం. చివరి రోజు ఉదయం కూడా మ్యాచ్‌లో ఏదైనా అద్భుతం చేయగలమనే నమ్మకం మాకు కలిగింది. కనీసం మ్యాచ్‌ను డ్రా చేసుకునే అవకాశం ఉందని భావించాము. జట్టు ఆటగాళ్లలో కనిపించిన ఉత్సాహం, పోరాట తత్వం నాకు నచ్చింది. టాప్ ఆర్డర్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ మా బ్యాటర్లు విఫలమవడం ఓటమికి ప్రధాన కారణం. యువ బ్యాటర్ సోనల్ దినూష బాగా ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 84 పరుగులు చేసి శ్రీలంక తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. టెస్టు క్రికెట్‌పై దినూషకు ఉన్న ఆసక్తి, సుదీర్ఘంగా బ్యాటింగ్ చేయాలనే అతడి విధానం నన్ను ఆకట్టుకున్నాయి. టెస్టుల్లో ఎక్కువసేపు క్రీజులో నిలవడం, పరుగులు సాధించడం, మ్యాచ్‌పై ప్రభావం చూపించడం వంటి అంశాలను యువ ఆటగాళ్లు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం దక్కింది' అని కిర్‌స్టెన్ తెలిపాడు. గాయాలతో సతమతం అవుతున్న శ్రీలంకపై విజయం సాధించడం టీమిండియాకు ఈజీనే అని చెప్పాలి.

# పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత్...



అమ్‌స్టెల్వీన్ వేదికగా జరిగిన హాకీ వరల్డ్ కప్ 2026 పూల్-డీ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత పురుషుల హాకీ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ 5-3తో పాకిస్థాన్‌ను చిత్తు చేసి టోర్నీలో టాప్-8 స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ చేతిలో ఎదురైన పరాజయం తర్వాత భారత జట్టు అద్భుతంగా పుంజుకుని కీలక విజయాన్ని అందుకుంది.

### ఆరంభం నుంచే భారత్ ఆధిపత్యం

ఇంగ్లండ్‌పై ఓటమి తర్వాత భారత్‌కు పాకిస్థాన్‌తో మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ప్రపంచకప్‌లో తమ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి పరిస్థితి. ఈ నేపథ్యంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు తొలి క్వార్టర్ నుంచే దూకుడుగా ఆడింది. భారత్ ప్రారంభం నుంచే ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచుతూ మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధించింది. పాకిస్థాన్ అప్పుడప్పుడు ఎదురుదాడులు చేసినప్పటికీ, భారత ఆటగాళ్లు ఆధిపత్యాన్ని కొనసాగించారు.

### హర్మన్‌ప్రీత్, అభిషేక్ మెరుపులు

భారత్ విజయంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. అతను రెండు గోల్స్ సాధించి జట్టుకు బలమైన ఆధిక్యాన్ని అందించాడు. అభిషేక్ కూడా రెండు గోల్స్ చేసి భారత దూకుడును కొనసాగించాడు. హార్దిక్ సింగ్ మరో గోల్ సాధించడంతో భారత్ మొత్తం ఐదు గోల్స్ పూర్తి చేసింది. ఈ ముగ్గురి అద్భుత ప్రదర్శనతో పాకిస్థాన్ మూడు గోల్స్ చేసినప్పటికీ మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకోలేకపోయింది.

### రెండో క్వార్టర్‌లో గోల్స్ వర్షం

రెండో క్వార్టర్ ప్రారంభమైన వెంటనే భారత్ తన దూకుడును కొనసాగించింది. 20వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ సద్వినియోగం చేసుకుని తన రెండో గోల్ సాధించాడు. దీంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. 21వ నిమిషంలో షాహిద్ హన్నన్ గోల్ చేయడంతో పాకిస్థాన్ ఖాతా తెరిచింది. అయితే భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. 23వ నిమిషంలో అభిషేక్ మరో గోల్ చేసి స్కోరును 4-1గా మార్చాడు. ఒక నిమిషం తర్వాత సుఫ్యాన్ ఖాన్ పాకిస్థాన్ తరఫున గోల్ చేయడంతో ఆధిక్యం 4-2కు తగ్గింది. అయినప్పటికీ భారత్ సమన్వయంతో ఆడి తొలి అర్ధభాగాన్ని 4-2 ఆధిక్యంతో ముగించింది.

### హార్దిక్ సింగ్ గోల్‌తో భారత్‌కు మరింత ఆధిక్యం

మూడో క్వార్టర్‌లోనూ భారత్ దూకుడును కొనసాగించింది. పెనాల్టీ అవకాశాన్ని హార్దిక్ సింగ్ గోల్‌గా మలచడంతో భారత్ 5-2 ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి పాకిస్థాన్ తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ వ్యవస్థను ఛేదించలేకపోయింది. భారత డిఫెన్స్ సమర్థంగా అడ్డుకోవడంతో మూడో క్వార్టర్ ముగిసే సమయానికి భారత్ 5-2తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది.

### చివరి క్వార్టర్‌లో పాకిస్థాన్ పోరాటం

చివరి 15 నిమిషాల్లో పాకిస్థాన్ మరోసారి పోరాటాన్ని ప్రారంభించింది. 45వ నిమిషంలో షాహిద్ హన్నన్ తన రెండో గోల్ సాధించి స్కోరును 5-3కు తీసుకొచ్చాడు. దీంతో మ్యాచ్‌లో ఉత్కంఠ మరింత పెరిగింది. అయితే చివరి నిమిషాల్లో భారత ఆటగాళ్లు అద్భుతమైన నియంత్రణ ప్రదర్శించారు. పాకిస్థాన్‌కు మరో గోల్ చేసే అవకాశం ఇవ్వకుండా భారత డిఫెన్స్ పటిష్టంగా నిలిచింది. చివరకు భారత్ 5-3తో చిరకాల ప్రత్యర్థిపై ఘన విజయాన్ని నమోదు చేసింది.

### టాప్-8లో టీమిండియా

ఈ విజయంతో భారత్ హాకీ వరల్డ్ కప్ 2026లో టాప్-8 స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఇంగ్లండ్‌పై ఓటమి తర్వాత పాకిస్థాన్‌పై సాధించిన విజయం భారత జట్టుకు భారీ ఆత్మవిశ్వాసాన్ని అందించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, అభిషేక్, హార్దిక్ సింగ్ కీలక సమయంలో గోల్స్ సాధించడంతో భారత్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. పాకిస్థాన్‌పై 5-3 విజయం సాధించి భారత జట్టు ప్రపంచకప్ తదుపరి దశకు దూసుకెళ్లింది.

# బిజినెస్



## ట్రంప్ సుంకాలు విధించినా

డొనాల్డ్ ట్రంప్ టారిఫ్, ప్రపంచ వాణిజ్యంలో పెరుగుతున్న అనిశ్చితి మధ్య భారత్ తన ఎగుమతి మార్కెట్లను విస్తరించే ప్రయత్నాలను వేగవంతం చేసినా, అమెరికా ప్రాధాన్యం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, భారత మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా దాదాపు 20 శాతంగా కొనసాగుతోంది. 2022-23లో ఇది 17.4 శాతంగా ఉండేది. ఒక దశలో భారతీయ వస్తువులపై అమెరికా సుంకాలు 50 శాతం వరకు వెళ్లి, ఫిబ్రవరిలో 18 శాతానికి తగ్గి, ప్రస్తుతం 10 శాతంగా ఉన్నాయి. ఈ అనిశ్చితి నేపథ్యంలో ఒక్క అమెరికా మార్కెట్‌పై ఆధారపడకుండా భారత్ యూకేతో వాణిజ్య ఒప్పందాన్ని అమల్లోకి తీసుకురావడంతో పాటు ఈయూ, ఒమన్, న్యూజిలాండ్ వంటి దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ నెలలో సదరన్ ఆఫ్రికన్ కస్టమ్స్ యూనియన్‌తోనూ వాణిజ్య చర్చలకు కీలకమైన ఒప్పందం చేసుకుంది. అమెరికా మార్కెట్ పరిమాణంతో పాటు భారత ఎలక్ట్రానిక్స్, ఫార్మా, టెక్స్‌టైల్ ఉత్పత్తులకు అక్కడ ఉన్న అపారమైన డిమాండ్‌ను భర్తీ చేయడం సులభం కాదని స్పష్టమవుతోంది. కొత్త మార్కెట్లలో స్థిరమైన స్థానం సంపాదించడానికి కనీసం 2-3 సంవత్సరాలు పడుతుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు.

# పిల్లల భద్రత కంటే లాభాలే ముఖ్యం..



సోషల్ మీడియా దిగ్గజ సంస్థ 'మెటా', పిల్లల భద్రత కంటే సంస్థ లాభాలు, యూజర్ల సంఖ్యకే ప్రియారిటీ ఇచ్చిందని మెటా మాజీ సేఫ్టీ ఇంజనీరింగ్ డైరెక్టర్ ఆర్టురో బెజార్ కోర్టు విచారణలో సాక్ష్యం చెప్పారు. అమెరికాలోని కాలిఫోర్నియా స్టేట్ ఆక్‌లాండ్‌లోని ఫెడరల్ కోర్టులో మెటాపై పలు రాష్ట్రాలు దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

### 13 ఏళ్ల లోపు పిల్లలపై 'డోంట్ ఆస్క్, డోంట్ టెల్' వైఖరి..

ఇక 13 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారులు ఇన్‌స్టాగ్రామ్ ను ఉపయోగిస్తున్నారని తెలిసినప్పటికీ, సంస్థ డోంట్ ఆస్క్, డోంట్ టెల్ విధానాన్ని పాటించిందని బెజార్ తెలిపారు. ఫేక్ ఖాతాలను గుర్తించే అత్యాధునిక సాంకేతికత మెటా వద్ద ఉన్నప్పటికీ, 13 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల వయస్సును నిర్ధారించడానికి ఎలాంటి కండిషన్లను సంస్థ పెట్టలేదని పేర్కొన్నారు. ఉద్యోగుల పనితీరు కూడా వినియోగదారుల సంఖ్య, వారు యాప్‌పై గడిపే సమయం ఆధారంగానే అయ్యేవని, ఈ క్రమంలో పిల్లల భద్రత అనేది చివరి ప్రాధాన్యతగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. చిన్నారులకు సోషల్ మీడియాను అలవాటు చేసి వారి మానసిక ఆరోగ్యంపై దెబ్బకొడుతోందని, తల్లిదండ్రుల పర్మిషన్ లేకుండా డేటాను సేకరిస్తోందని ఆరోపిస్తూ అమెరికాలోని 29 రాష్ట్రాలు మెటాపై చట్టపరమైన కేసులు దాఖలు చేశాయి. అయితే, ఈ ఆరోపణలను తిరస్కరించిన 'మెటా', పిల్లల భద్రతకు తమ సంస్థ కట్టుబడి ఉందని కోర్టులో వాదిస్తోంది.






# ఒక్కరోజే రూ.వేలల్లో పెరిగిన ధర

హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో బంగారం ధరలు దిమ్మతిరిగే షాకిచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలు, స్థానిక డిమాండ్ ప్రభావంతో ఇవాళ బంగారం ధరల్లో భారీ పెరుగుదల నమోదు కావడంతో వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. ఇవాళ ఒక్కరోజే 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారంపై రూ.4,300 మేర ఎగబాకింది. ఈ పెరుగుదలతో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,59,270కి చేరింది. ఇక ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా అదే బాటలో పయనించింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,950 పెరిగి, మార్కెట్‌లో రూ.1,46,000 మార్కును తాకింది. బంగారం ధరలు ఎన్నడూ లేని విధంగా ఒకేరోజు వేల రూపాయల్లో పెరగడంతో బులియన్ మార్కెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

# డిజిటల్ ట్రాన్సాక్షన్స్‌కూ లిమిట్ !




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులకు బిగ్ అలర్ట్. ఎస్‌బీఐ బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలకు సంబంధించిన రూల్స్ లో కీలక మార్పులు చేశారు. వినియోగదారులు అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నెలలో నాలుగు సార్లు మాత్రమే ఫ్రీగా క్యాష్ విత్ డ్రా చేసుకోవచ్చని ప్రకటించింది ఎస్‌బీఐ. ఆ పరిమితి దాటితే ఒక్కో ట్రాన్సాక్షన్ పై రూ. 15 ఛార్జ్ తో పాటు జీఎస్టీ కూడా వసూలు చేయనున్నారు. ఇందులో బ్రాంచ్, ఏటీఎం, విత్ డ్రాస్ తో పాటు ఏఈపీఎస్ ట్రాన్సాక్షన్ కౌంట్ అవుతాయి. అంతకు ముందు కూడా నాలుగు ఉచిత లావాదేవీలు చేసిన తర్వాత రూ.15 ఛార్జ్ విధించేవారు. కానీ డిజిటల్ ట్రాన్సాక్షన్ దీని పరిధిలోకి రాలేదు. ఇప్పుడు ఆ మినహాయింపు లేదని వెల్లడించింది బ్యాంక్. మునుపటి తరహాలో కాకుండా డిజిటల్ లావాదేవీలను కూడా ఈ ఉచిత లావాదేవీల పరిధిలోనే చూస్తారు. అంటే ఇకపైన ఏటీఎం, బ్రాంచ్, డిజిటల్ ట్రాన్సాక్షన్ అన్ని కలిపి ఉచిత క్యాష్ విత్ డ్రా పరిమితి నాలుగు లావాదేవీలకు మాత్రమే ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఈ ఛార్జ్ అమలు చేయనుంది ఎస్‌బీఐ.



# ధర్మన్‌తో కోలీవుడ్ ఎంట్రీకి సిద్ధమైన ఎనర్జిటిక్ స్టార్

తన కెరీర్లోనే తొలిసారిగా మెగా ఫోన్ పట్టిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని.. ప్రస్తుతం 'RAPO 23'తో బిజీగా ఉన్నాడు. తన స్వీయడైరెక్షన్‌లో రాబోతున్న ఈ మూవీ కోసం రామ్ 24గంటల్లో షూటింగ్‌లో కష్టపడుతున్న తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. రామ్‌కి కోలీవుడ్ నుంచి ఊహించని ఆఫర్ వచ్చినట్లు టాలీవుడ్ సినీ వర్గాల నుంచి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, లోకనాయకుడు కమల్ హాసన్ నిర్మాణంలో భారీ ప్రాజెక్ట్ రాబోతున్న విషయం తెలిసిందే. 'ధర్మన్' అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. ఇందులో రజనీకాంత్‌కి పాత్రకి ధీటుగా ప్రతినాయకుడి పాత్ర కోసం రామ్ పోతినేని సంప్రదించారట మేకర్స్. చర్చలు అనంతరం రామ్ నుంచి సానుకూల స్పందన లభించినట్లు టాక్. ఈ చర్చలు ఫలిస్తే సూపర్ స్టార్ రజనీకాంత్‌ను, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనిని ఒకే ఫ్రేమ్‌లో చూడొచ్చు అంటూ పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.

కోలీవుడ్

దిగ్గజ దర్శకుడు శంకర్ వారసురాలిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఎంట్రీ ఇచ్చిన అదితి శంకర్.. నటనతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకుంది. తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు.. త్వరలో 'వన్స్ మోర్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవతున్నది. విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామా ఆగస్టు 28న థియేటర్‌లోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ప్రమోషన్స్ పాల్గొన్న అదితి శంకర్.. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవలే వెల్లడించిన బ్రేకప్, ఎమోషనల్ స్టోరీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'ఇటీవలే నా తోటి నటి అనుపమ ఇచ్చిన ఇంటర్వ్యూ చూశాను. దీనిపై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండవచ్చు. కానీ, తన సొంత కథను ధైర్యంగా పంచుకున్నందుకు ఆమెకు హాట్సాఫ్ చెప్పాలి. అందులో నిజాయితీ ఉంది. ఎవరినీ కించపరచాలనేది ఆమె ఉద్దేశం కాదని భావిస్తున్నాను. ఆమె పంచుకున్న అనుభవం చాలామందికి అవగాహన కలిగిస్తుంది. ఎందుకంటే, ఎంతోమంది స్త్రీలు, పురుషులు తమ జీవితాల్లో ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటూ, తమకు ఏం జరుగుతోందో కూడా గ్రహించలేకపోతున్నారు' అని తన అభిప్రాయాన్ని పంచుకుంది.

# ఇలాంటివి చెప్పాలంటే ధైర్యం ఉండాలి




# జనవరి 12 విడుదల.. రావిపూడి టైటిల్ అదిరిందిగా

టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్ అంటేనే గుర్తొచ్చే సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, ఈసారి బాక్సాఫీస్ వద్ద మరో భారీ మల్టీస్టారర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలయికలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇప్పటికే వెంకీ, కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్స్ సినీ ప్రియుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా చిత్ర బృందం విడుదల చేసిన సరికొత్త వీడియో ద్వారా సినిమా టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. ఇప్పటివరకు #VenkyAnil5 మరియు #NKRAR2 అనే వర్కింగ్ టైటిల్స్‌తో కొనసాగిన ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. దీనికి తోడు 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే క్యాచీ ట్యాగ్‌లైన్‌ను జతచేసి, సినిమాలో వెంకటేష్ మరియు కళ్యాణ్ రామ్ మధ్య నడిచే బావా-బామ్మర్దుల సరదా అనుబంధాన్ని స్పష్టంగా తెలియజేశారు. ఈ




ప్రమోషనల్ వీడియో ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. దిగ్గజ దర్శకుడు ఇ.వి.వి. సత్యనారాయణ రూపొందించిన క్లాసిక్ కామెడీ 'అప్పుల అప్పారావు' సీన్‌తో ప్రారంభమైన ఈ వీడియోలో.. వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి నలుగురూ కలిసి దర్శకుడు అనిల్ రావిపూడిని టైటిల్ ఏంటని ప్రశ్నిస్తారు. దానికి అనిల్ "జనవరి 12 విడుదల" అని సమాధానమివ్వగా, విడుదల తేదీ కాకుండా సినిమా పేరేంటని వారంతా కన్ఫ్యూజ్ కావడం, చివరికి అదే టైటిల్ అని రివీల్ చేయడం వంటి సన్నివేశాలతో వీడియోలో ఫన్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ చక్కగా పండింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ స్వరాలు సమకూరుస్తున్నారు. సంక్రాంతి రేసులో అనిల్ రావిపూడి గతంలో సాధించిన భారీ విజయాల ట్రాక్ రికార్డు ఉంది. ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో పాటు కీర్తి సురేష్, కృతి శెట్టి వంటి బలమైన తారాగణంతో రాబోతున్న ఈ చిత్రం 2027 జనవరి 12న గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

# దసరా బరిలో యామీ గౌతమ్..

బాలీవుడ్ బ్యూటీ యామీ గౌతమ్ గత ఏడాది చేసిన 'హక్' విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకోవడంతో పాటు పలు అవార్డులను కూడా రాబట్టింది. అదే జోష్‌తో ఆమె ఇటీవల 'ధురంధర్: ది రివెంజ్'లో కీలక పాత్రలో కనిపించి బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇక ఇప్పుడు ఆమె మరో విభిన్నమైన కథతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. బాలాజీ మోహన్ దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సూపర్‌న్యాచురల్ హారర్-కామెడీ చిత్రం 'నయీ నవేలీ'. ఇందులో యామీ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అమెజాన్ MGM స్టూడియోస్, కలర్ ఎల్లో సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మీరట్ నేపథ్యంలో సాగే ఈ కథలో, అల్లకల్లోలంగా ఉన్న ఒక కుటుంబంలోకి అడుగుపెట్టి అందరికీ సంతోషాన్ని పంచే పర్ఫెక్ట్ కోడలిగా యామీ కనిపిస్తారు.అయితే, ఆమె ప్రవర్తన చూసి బావకి అనుమానం వచ్చి, ఆమె ఒక చేతబడి చేసే మహిళ అని భావించడంతో అసలు కథ మొదలవుతుందని సమాచారం. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కాగా.. తాజాగా, ఈ చిత్రాన్ని దసరా పండగ కానుకగా అక్టోబర్ 16, 2026న దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. కామెడీ, ఫాంటసీ, అడ్వెంచర్ మేళవించిన పాత్రలో యామీ నటన సినిమాకే హైలైట్‌గా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ పాత్రకు యామీ గౌతమ్ మాత్రమే సరైన ఎంపిక అని నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ ప్రశంసించారు. ఈ కథకు కావాల్సిన అమాయకత్వం, కొంటెతనం రెండూ యామీలో మెండుగా ఉన్నాయని, తన పర్ఫార్మెన్స్‌తో సినిమాను నెక్ట్స్ లెవెల్‌కి తీసుకెళ్లారని అన్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌తో యామీ గౌతమ్ ఈ దసరాకి థియేటర్లలో అలరించబోతుండటం విశేషం.








# ఓటీటీలోకి 'శ్రీనివాస మంగాపురం'..

ఘట్టమనేని కుటుంబం నుంచి వచ్చిన జయకృష్ణ ఎన్నో ఆశలతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాతోనే బాలీవుడ్ స్టార్ బ్యూటీ రవీనా టాండన్ కూతురు రాషా తడానీ కూడా తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. అజయ్ భూపతి దర్శకత్వంలో భారీ అంచనాలతో జూలై 30న థియేటర్లలోకి వచ్చిన ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా, బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా రాణించలేకపోయింది. కలెక్షన్లు రాక సినిమా నిర్మాతలకు నష్టాలు తెచ్చిపెట్టడంతో, ఆ ఫ్లాప్ బాధ్యతను దర్శకుడు అజయ్ భూపతి తనపైనే వే-సుకున్నారు. అయితే థియేటర్లలో మిస్సయిన సినీ ప్రియుల కోసం ఈ సినిమాను ఓటీటీలోకి తీసుకురాబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా.. ఆగస్ట్ 20 నుంచి అంటే రేపటి నుంచే ఈ మూవీ స్ట్రీమింగ్ కాబోతోందని తెలిపారు. ప్రేమ, పగ, వేదన, భీకర యాక్షన్‌తో కూడిన ఈ కథను తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి తెస్తున్నారు.

# టాక్సిక్ తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదిక ఖరారు

యశ్, కియారా అద్వానీ జంటగా నటించిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, తారా సుతారియా, నయనతార కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి విశాల్ మిశ్రా, రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా సంగీతం అందించారు. కెవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, హీరో యశ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. 'టాక్సిక్' చిత్రాన్ని ఆగస్టు 26న విడుదల చేయనున్నారు. ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్లను కూడా భారీ స్థాయిలో నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా మూవీ టీమ్ తెలుగు ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ఆగస్టు 22న హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో సాయంత్రం 5 గంటల నుంచి 'టాక్సిక్' తెలుగు ప్రీ-రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎవరైనా వస్తారా? లేక మూవీ యూనిట్‌తోనే ఈవెంట్‌ను పూర్తి చేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.







# భయాన్ని పక్కన పెట్టి... ధైర్యంగా

కియారా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ కీలక పోస్ట్ షేర్ చేశారు. 'టాక్సిక్'లో నటించడం తనకు ఒక కొత్త అనుభవమని, భయాన్ని పక్కన పెట్టి కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఈ సినిమా ఎంతగానో ఉపయోగపడిందని కియారా చెప్పారు.షూటింగ్ సమయంలో నీళ్లతో నిండిన ఒక పెద్ద ప్లాస్టిక్ ట్యాంక్‌లో ఉన్న ఫోటోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. సినిమాలు మనల్ని ఎప్పుడూ ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయని కియారా చెప్పారు. ప్రతీ కొత్త పాత్ర, ప్రతీ కొత్త ఛాలెంజ్ మనం ఏమేం చేయగలమో మనకే తెలిసేలా చేస్తుందని అన్నారు. కొంచెం భయం అనిపించినా సరే ధైర్యంగా ముందుకెళ్లినప్పుడే జీవితంలో ఎదుగుదల ఉంటుందని చెప్పారు. అలవాటు లేని కొత్త విషయాలను కూడా స్వీకరిస్తూ ప్రశాంతంగా ఉండటం ఈ సినిమా తనకు నేర్పిందని కియారా తెలిపారు. దాదాపు రూ. 500 నుంచి 1000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారాతో పాటు నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కూడా నటిస్తున్నారు. అండర్‌వరల్డ్ నేర ప్రపంచంలో రాయ అనే గ్యాంగ్‌స్టర్ కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**